ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 2 జూన్ 2024



సీటీఎం వద్ద నెలకొల్పిన మదనపల్లె స్పిన్నింగ్ మిల్లు

కూటమిలో జోష్



- జగన్ పాలనకు జనం బైబై
- కూటమిదే అధికారమంటూ ఎగ్జిట్‌పోల్స్‌లో మెజార్టీ సర్వేల అంచనా
- ఫలితాలపై కేకే సర్వే అంచనాలు.. సంచలనం
- ఉమ్మడి కడప జిల్లాలో వైసీపీకి పులివెందుల, బద్వేలు, రాయచోటి మాత్రమే
- కడప, రాజంపేట ఎంపీ సహా మిగతా అన్ని స్థానాలు కూటమివే
- జమ్మలమడుగులో బీజేపీ, కోడూరులో జనసేన అంటూ ఎగ్జిట్‌పోల్స్ వెల్లడి
- ఫలితాలకు ముందే కూటమిలో ఉత్సాహం
- వైసీపీలో నైరాశ్యం



అందరూ ఎప్పుడెప్పుడా అంటూ ఎదురుచూసిన ఎగ్జిట్ పోల్స్ శనివారం సాయంత్రం 6.30 గంటల తరువాత వెలువడ్డాయి. వివిధ సర్వే, మీడియా సంస్థలు ఎగ్జిట్‌పోల్స్ వివరాలను ప్రకటించాయి. అయితే అందరూ ఊహించినట్లుగానే మెజార్టీ సర్వే సంస్థలు రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమిదే అధికారమని తేల్చేశాయి. ఇక వైసీపీ అనుకూల మీడియా, వైసీపీకి అనుకూలంగా ఇస్తారంటూ సోషల్‌మీడియాలో ప్రచారం జరిగిన సంస్థలు మాత్రం వైసీపీదే విజయమంటూ ప్రకటించాయి. అయితే మెజార్టీ ఎగ్జిట్‌పోల్స్ అన్నీ కూటమికే పట్టం కట్టడంతో ఫలితాలకు ముందే ఎన్‌డీఏ కూటమిలో నయాజోష్ నెలకొంది. సర్వేలు వచ్చిన తరువాత వైసీపీ శ్రేణులు డీలా పడ్డాయి.

(కడప-ఆంధ్రజ్యోతి): వై నాట్ 175 అంటూ గొప్పలు పోయిన జగన్ అండ్ కోకు ఎగ్జిట్ పోల్స్ దిమ్మతిరిగే షాక్ ఇచ్చాయంటారు. ఇక కేకే సర్వే సంస్థ అయితే ఉమ్మడి కడప జిల్లాలో పులివెందుల, బద్వేలు, రాయచోటి మాత్రమే వైసీపీ ఖాతాలో వేయగా, మిగతా ఏడు అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలను టీడీపీ, బీజేపీ ఖాతాలో వేసి వైసీపీ శ్రేణులకు షాక్ ఇచ్చింది. కౌంటింగ్‌కు రెండు రోజుల ముందు ప్రకటించే ఎగ్జిట్‌పోల్స్ కోసం జనం ఆతృతగా ఎదురు చూస్తూ వచ్చారు. మెజార్టీ సంస్థలు జనం నాడిని పసిగట్టి కూటమిదే అధికారమంటూ తేల్చేశాయి. ఈసారి సార్వత్రిక ఎన్నికలు కూడా హోరాహోరీగా సాగాయి. అన్ని నియోజకవర్గాల్లో నువ్వా నేన్నా అన్నట్లుగా ఉన్నాయి. పోల్ మేనేజ్‌మెంటులో ఒకటి రెండుచోట్ల మినహాయిస్తే ఇరుపార్టీలు పోటాపోటీగా చేసుకున్నారు. అందుకే ఈసారి కడప, అన్నమయ్య జిల్లాలో వార్ వన్ సైడ్ కాదంటూ ఎగ్జిట్ పోల్స్‌లో కూడా తేలిపోయింది.

కేకే సర్వే సంచలనం

కేకే సంస్థ తన ఎగ్జిట్‌పోల్స్‌లో ఉమ్మడి కడప జిల్లాతో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె ఫలితాలపై సంచలన అంచనాలను వెలువరించింది. స్టేట్‌లో మిగతా చోట్ల ఫలితాలు ఎలా ఉన్నా కడపలో వైసీపీకి అనుకూలంగా ఉంటాయనుకున్నారు. అయితే కేకే సర్వే మాత్రం ఉమ్మడి కడప జిల్లాలోనే కేవలం వైసీపీకి సీఎం జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల, బద్వేలు, రాయచోటిలో మాత్రమే గెలుస్తుందని తేల్చింది. ఇక కడప పార్లమెంటు టీడీపీ గెలుస్తుండగా, కడప అసెంబ్లీ, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు రాజంపేటలలో టీడీపీ గెలుస్తుందని ప్రకటించింది. రాజంపేట పార్లమెంటు, జమ్మలమడుగు అసెంబ్లీ స్థానాలను బీజేపీ, రైల్వేకోడూరు అసెంబ్లీని జనసేన గెలుచుకుంటుందని తేల్చింది. కేకే సర్వేప్రకారం ఉమ్మడి జిల్లాలో తొలిసారిగా బీజేపీ జమ్మలమడుగు, రాజంపేట పార్లమెంటులో గెలుస్తుండగా జనసేన రైల్వేకోడూరులో సత్తా చాటనున్నాయి. ఇక ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లెలో కూడా టీడీపీ విజయకేతనం ఎగురవేయనుందని కేకే సర్వే ఎగ్జిట్‌పోల్స్‌లో ప్రకటించింది.

జిల్లాలో టీడీపీకి పూర్వవైభవం

ఉమ్మడి కడప జిల్లా 2004 ఎన్నికల ముందు వరకు టీడీపీకి కంచుకోటగా ఉండేది. 2004 తరువాత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం కావడంతో రాజకీయ పరిస్థితులు మారాయి. వైఎస్ మరణం, రాష్ట్ర విభజన, వైసీపీ ఏర్పాటు నేపథ్యంలో.. జిల్లా ప్రజలు వైఎస్ తనయుడు జగన్‌కు జై కొట్టారు. 2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో వైసీపీ 10 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలను కైవసం చేసుకుంది. అయితే.. తాజాగా వెలువరించిన కేకే ఎగ్జిట్‌పోల్స్ వాస్తవం అయితే ఈ ఎన్నికలతో మళ్లీ టీడీపీకి పూర్వవైభవం వచ్చినట్లే. ఇక ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు చూసి టీడీపీ శ్రేణులు సంతోషంలో మునిగితేలుతున్నారు. వైసీపీ శ్రేణులు నిరాశలో ఉన్నారు. ఎగ్జిట్‌పోల్స్ కాదు.. కౌంటింగ్‌రోజున అసలు ఫలితాలు వస్తాయంటూ వైసీపీ నేతలు చెప్పుకోవడాన్ని కేడర్ నమ్మడం లేదు. మెజార్టీ సర్వేలు కూటమికే పట్టం గడుతున్నాయి. అయితే మళ్లీ మనదే అధికారం అంటూ వైసీపీ చెబుతుండటాన్ని కొందరు వైసీపీ కార్యకర్తలే నమ్మడంలేదు.



టీవీలకు అతుక్కుపోయిన జనం

ఇక మే13న పోలింగ్ ముగిసింది. అప్పటి నుంచి గెలుపు మాదే అంటే మాదేనంటూ ఇరుపార్టీలు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ వచ్చాయి. ఇక పోలింగ్ బూత్‌ల వారీగా లెక్కలు వేసుకుంటూ, సర్వేలు చేయిస్తూ, ప్రత్యేక టీంతో ఓటరు నాడి తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ పోలింగ్‌కు ముందు వచ్చే ఎగ్జిట్‌పోల్స్ కోసం ఎప్పుడెప్పుడా అంటూ ఎదురు చూస్తూ వచ్చారు. తుది ఫలితం 4న రానుంది. అయినప్పటికీ ఈసారి ఎన్నడూ లేనివిధంగా ఎగ్జిట్‌పోల్స్ ఫలితం కోసం సాయంత్రం 4.30 గంటల నుంచే జనం టీవీలకు అతుక్కుపోయారు. ఈసీ నిబంధనల ప్రకారం సాయంత్రం 6.30 తరువాత ఎగ్జిట్‌పోల్స్ వెలువడ్డాయి. గాలి, కొన్ని చోట్ల వర్షం కురవడంతో కొన్ని చోట్ల కరెంటు పోయినప్పటికీ.. మొబైల్స్‌లో ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు చూశారు. మెజార్టీ సర్వే సంస్థలు కూటమిదే విజయమని టీవీల్లో చెబుతుంటే వైసీపీ అనుకూల మీడియా మాత్రం వారికి అనుకూలంగా ఇచ్చిన సర్వేలనే పదే పదే చూపిస్తూ వచ్చింది. దీనిని వైసీపీ వర్గాలే నమ్మకపోవడం విశేషం.

పదేళ్ల పోరాటం..

- మదనపల్లె స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు బకాయిలు చెల్లింపు
- 42 ఏళ్ల తరువాత చేతులు మారింది..

మదపనపల్లె టౌన్, జూన్ 1: వేలాది మంది కార్మికుల కుటుంబాలకు జీవనోపాధి అందించిన మదనపల్లె స్పిన్నింగ్ (సీటీఎం) మిల్లు నేడు చేతులు మారింది. మిల్లు మూతపడినప్పటి నుంచి పదేళ్ల పాటు తమకు రావాల్సిన బకాయిలు కోసం పోరాడిన కార్మికులకు ఎట్టకేలకు శనివారం చెక్కులు పంపిణీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. 1972లో టీఎన్ కృష్ణారెడ్డి కుటుంబీకులు స్థాపించిన మదనపల్లె స్పిన్నింగ్ మిల్లులో మూడు షిఫ్టులుగా 1200 మంది కార్మికులు పనిచేసేవారు. ఇక్కడ పత్తి నుంచి తయారు చేసిన దారం విదేశాలకు సైతం ఎగుమతి చేసేవారు. అలాంటి స్పిన్నింగ్ మిల్లులో కార్మికుల మధ్య యూనియన్‌లు ఏర్పడి ఆధిపత్య పోరాటాలు చేసుకోవడం మొదలైంది. 2007 సంవత్సరంలో కార్మికుల మధ్య ఆధిపత్య పోరుతో హత్యాకాండకు కూడా దారి తీసింది. ఇలాంటి తరుణంలో అప్పటి యజమాన్యం నిర్వహణ లోపం, యూనియన్ల మధ్య గొడవల కారణంగా 2014లో మిల్లు మూతపడింది. 1200 మంది కార్మికుల్లో చాలామంది వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని మిల్లు యజమాన్యం ఇచ్చిన డబ్బులతో సంతృప్తి పడగా, మిల్లులో 30 ఏళ్లకు పైగా పనిచేసిన 308 మంది కార్మికులు ఇందుకు ఒప్పుకోలేదు. తమకు రావాల్సిన పీఎఫ్, జీతాల బకాయిలు చెల్లించాలని కోర్టుకు వెళ్లారు. పదేళ్లుగా కోర్టులో కేసు జరుగుతూనే ఉంది.

పదేళ్లకు కార్మికుల బకాయిలు చెల్లింపు

మదనపల్లె స్పిన్నింగ్ మిల్లును కర్ణాటక లిక్విడేటర్ వద్ద గత నెల 28వ తేదీ ఆన్‌లైన్ వేలంలో తిరుపతికి చెందిన గిరిధర్‌రెడ్డి అనే పారిశ్రామికవేత్త రూ.39 కోట్లకు కొనుగోలు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో 308 మంది కార్మికులకు చెల్లించాల్సిన రూ.6.70 కోట్ల బకాయిల్లో రూ.4.51 కోట్లు కర్ణాటక లిక్విడేటర్ వద్ద డిపాజిట్ చేశారు. మిగిలిన రూ.2.19 కోట్లు చెక్కుల రూపంలో కార్మికులకు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం మిల్లు ఆవరణంలో నిర్వహించిన సమావేశంలో గిరిధర్‌రెడ్డి కార్మికులకు చెక్కులను పంపిణీ చేశారు. దీంతో పాటు కార్మికులకు చెల్లించాల్సిన ప్రావిడెంట్ ఫండ్‌కు సంబంధించి రూ.1.10 కోట్లు విజయవాడ ఏఆర్‌సీ బ్యాంకు లిక్విడేటర్ వద్ద డిపాజిట్ చేసినట్లు తెలిసింది.



కార్మికులకు బకాయిలు చెక్కులను అందచేస్తున్న గిరిధర్‌రెడ్డి

ఐదు గంటలు ఆలస్యంగా 'సెవెన్ హిల్స్'

- రైలు ప్రయాణికులకు చుక్కలు
- అర్ధరాత్రి స్టేషన్‌లో ప్రయాణికుల అవస్థలు

ములకలచెరువు, జూన్ 1: రైలు ప్రయాణికులకు చుక్కలు కన్పించాయి. సికింద్రాబాద్ నుంచి ములకలచెరువు మీదుగా తిరుపతికి నడిచే సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్ రైలు ఐదు గంటలకు పైగా ఆలస్యంగా నడిచింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సికింద్రాబాద్ జంక్షన్ నుంచి కాచిగూడ, కర్నూల్, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం జంక్షన్, కదిరి, ములకలచెరువు, మదనపల్లె రోడ్, కలికిరి, పీలేరు, పాకాల జంక్షన్ మీదు గా వారానికి రెండుసార్లు సెవెన్ హిల్స్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ మార్గంలో నడుస్తుంది. ఈ క్రమంలో శనివారం నడిచిన సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆలస్యంగా నడిచింది. ములకలచెరువుకు తెల్లవారుజామున 2.49 గంటలకు రావాల్సిన ఈ రైలు ఉదయం 8.25 గంటలకు వచ్చింది. సాంకేతిక కారణాలతో ఈ రైలు సికింద్రాబాద్ జంక్షన్ నుంచే ఆలస్యంగా నడవడంతో ములకలచెరువు రైల్వేస్టేషన్‌కు వచ్చేసరికి ఐదు గం టలకుపైగా ఆలస్యమైంది. దీంతో ప్రయాణికులు రైలు కోసం గంటల తరబడిగా వేచి చేశారు. రాత్రివేళ కావడంతో రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు, తిరుపతికి వెళ్లే ప్రయాణికులకు చుక్కలు కన్పించాయి. తాగునీరు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. ఈ రైలు మదనపల్లె రోడ్‌కు తెల్లవారుజామున 3.19 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 9.03 గంటలకు, కలికిరికి తెల్లవారుజామున 3.49 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 9.28కు, పీలేరుకు తెల్లవారుజామున 4.09 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 9.40 గంటలకు, తిరుపతికి ఉదయం 6.25 గంటలకు వెళ్లాల్సి ఉండగా 11.29 గంటలకు వెళ్లింది. రైలు గంటల తరబడిగా ఆలస్యంగా నడవడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

అలాగే నరసాపూర్ నుంచి ధర్మవరం జంక్షన్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు కూడా ఒకటిన్నర గంట ఆలస్యంగా నడిచింది. ఈ రైలు ములకలచెరువుకు ఉదయం 6.49 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 8.34 గంటలకు వచ్చింది.

కౌంటింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు

- ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ పూర్తి చేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి టౌన్, జూన్ 1: కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ అధికారులకు సూచించారు. శనివారం ఆయన రాయచోటి పట్టణంలోని శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ జరిగే ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 12 కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేశామని, ప్రతి కౌంటింగ్ హాలులో 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కొరకు ప్రతి టేబుల్‌కు ఒక ఏఆర్‌వో, ఒక సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. ఈవీఎంల కౌంటింగ్ సంబంధించి ప్రతి టేబుల్‌కు ముగ్గురు సిబ్బంది ఉంటారని, ఇందులో ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. కౌంటింగ్ అధికారులు, సిబ్బంది కౌంటింగ్ రోజు ఉదయం 5 గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకుని తమకు కేటాయించిన కౌంటింగ్ సెంటర్‌కు వెళ్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి రిపోర్ట్ చేయాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం జారీ చేసిన నియమ నిబంధనలను తప్పక పాటించాలన్నారు.

ఎన్నికల పరిశీలకులకు అవసరమైన గదులను ఏర్పాటు చేసి అబ్జర్వర్ రూములో టీవీ ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ నిరంతరాయంగా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో సత్యనారాయణ, ఆర్డీవో రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



సాయి ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్

భజే వాయు పుత్రం..

- జిల్లా వ్యాప్తంగా వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

రాయచోటి టౌన్, జూన్ 1 : జిల్లావ్యాప్తంగా హనుజ్జయంతి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు క్యూ కట్టారు. హనుమంతుడిని పలు ఆలయాల్లో వివిధ రకాలుగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రాయచోటి పట్టణంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాయచోటి పట్టణంలోని మాండవ్యనది ఒడ్డున గల ప్రాచీన ప్రసన్నఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకల్లో వైభవంగా జరిగాయి. మదనపల్లె పట్టణంలోని పలు ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నీరుగట్టువారిపల్లెలోని కాట్లాటపల్లె రోడ్డు మారుతీనగర్‌లో వెలసిన ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని గంధంతో అలంకరణ చేసి విశేషంగా పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలోభక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ప్రత్యేక వాహనంలో అంజనేయస్వామి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. అలాగే స్థానిక చౌడేశ్వరీ సర్కిల్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్భంగా విశేషంగా పూజలు నిర్వహించారు. బీటీ కళాశాల మైదానంలోని వరాల ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆంజనేయుడికి మామిడిపండ్లతో ప్రత్యేకంగా అలంకరణలు చేశారు. సాయంత్రం ఉత్సవవిగ్రహాన్ని ప్రత్యేకంగా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తంబళ్లపల్లె మండలంలో శనివారం హనుమాన్ జయంతిని ప్రజలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. ఆలయాల్లో అంజనేయస్వామిని పూలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రైల్వేకోడూరులో హనుమజ్జయంతి సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని భక్తాంజనేయస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో ఉన్న ఆంజనేయస్వామికి వెండికవచం తొడిగి ప్రత్యేక పూలతో అలంకరించారు. రాజంపేట పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం నిర్వాహకులు, ఆలయ పూజారులు ఘనంగా నిర్వహించారు. మన్నూరు, ఆకులవీధి, పోలి చెరువు వద్దవున్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో, డీబీఎస్‌పల్లెలో ఉన్న ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయాలకు వచ్చి పూజలు నిర్వహించారు.



మదనపల్లెలో మామిడి పండ్ల అలంకరణలో వరాల ఆంజనేయస్వామి



రాయచోటి మాండవ్యనది ఒడ్డున ఉన్న ప్రసన్నాంజనేయస్వామికి భక్తుల పూజలు

కాసులు కురిపిస్తున్న బొప్పాయి

- టన్ను రూ.16 వేలు
- రూ.20 వేలకు పెరిగే అవకాశం
- ఎగబడుతున్న వ్యాపారులు
- ఐదు నెలలపాటు కోడూరులో మకాం
- ఎత్తిపోయిన మామిడి.. పుంజుకున్న బొప్పాయి



దిగుబడి బాగా వచ్చిన బొప్పాయి

రైల్వేకోడూరు, జూన్ 1: ఎప్పుడూ లేనంత విధంగా ఈ ఏడాది బొప్పాయి కాయల దిగుబడి విపరీతంగా వచ్చింది. ధర కూడా టన్ను రూ.16 వేలు ఉంది. అది రూ.20 వేలకు పెరిగే అవకాశం ఉంది. దిగుబడులు బాగా ఉండటం, ధరలు కూడా ఆశించినంతగా ఉండడంతో ఢిల్లీ మార్వాడీలు రైల్వేకోడూరులో మకాం పెట్టారు. ఇతర రాష్ట్రాల్లో బొప్పాయికి మంచి డిమాండు ఏర్పడింది. ఈ ఏడాదిలో మామిడి పూర్తి స్థాయి దిగుబడులు పడిపోయాయి. దీంతో మామిడి రైతులకు పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదు. వాతావరణంలో వచ్చిన మార్పులు, ప్రకృతి వైపరీత్యాలతో మామిడి రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారు. మామిడి వ్యాపారం లేక మండీలు ఖాళీగా ఉన్నాయి. కేవలం 5 శాతం దిగుబడి వచ్చింది. మామిడికి ఆశించినంత ధరలు ఉన్నా కాయలు లేకుండాపోయాయని రైతులు లబోదిబోంటున్నారు. 30 ఏళ్లగా ప్రతి మామిడి సీజన్‌లో కోడూరు మార్కెట్ యార్డు కిటకిటలాడేది. ప్రస్తుతం కాయలు లేక వెలవెలబోతోంది. 190 రోజుల పాటు వ్యాపారం సాగేది. కాయలు పూర్తి అయిపోయినట్లుగా యార్డు కనిపిస్తోంది. మామిడి తర్వాత బొప్పాయి విపరీతంగా సాగులోకి వచ్చింది. కోతల ప్రారంభంలోనే బొప్పాయి ధరలు విపరీతంగా పుంజుకున్నాయి. ప్రస్తుతం కొంత మేరకు మాత్రమే బొప్పాయి తోటల్లో కోతలను మార్వాడీ వ్యాపారులు ప్రారంభించారు. ఢిల్లీ తదితర నగరాలకు చెందిన మార్వాడీ వ్యాపారులు రైల్వేకోడూరులో అద్దెలకు ఇళ్లు తీసుకుని సీజన్ అయిపోయేంత వరకు చూసుకుని వెళ్లిపోతారు. ప్రస్తుతం టన్ను రూ.16 వేలు ఉండగా కొన్ని రోజులకు టన్ను రూ.20 వేలకు పెరిగే అవకాశాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో బొప్పాయి పంట విపరీతంగా వచ్చింది. దీంతో రైతులు ఆశించిన దానికంటే ఎక్కువగా ధరలు పలుకుతున్నాయి. బొప్పాయి ఈ ఏడాదిలో టాప్ రేటు పలుకుతుండడం తో మామిడి తోటలను నరికివేసే స్థితికి వస్తున్నాయి. రైల్వేకోడూరు నియోజకవర్గంలో మామిడి 25 వేల హెక్టార్లు ఉండగా చాలామంది రైతులు మామిడిని తీసివేసి బొప్పాయి సాగు చేయడంతో మామిడితో సమానంగా బొప్పాయి సాగులోకి వచ్చింది. ఒక్క ఎకరా బొప్పాయి సాగుకు కూలీలు, దున్నకాలు, ఎరువులు తదితర వాటికి సుమారుగా రూ.40 వేలు ఖర్చు వస్తుంది. ఆదాయం రూ.లక్షకు పైగా వస్తుందని రైతులు తెలిపారు. ఎప్పుడూ రానంత కాపు బొప్పాయికి వచ్చింది. రైల్వేకోడూరు నుంచి ప్రతిరోజూ 100 లారీలకు పైబడి బొప్పాయి కాయలను ఢిల్లీ, మహారాష్ట్ర, తమిళనాడు, పంజాబ్, కేరళ, కోల్‌కతా, హర్యానా, ఒరిస్సా గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్ తదితర నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. ఎక్కువగా కాయలు ఢిల్లీ మార్కెట్‌కు పంపిస్తున్నారు. రైల్వేకోడూరులో ఢిల్లీ లారీలే ఎక్కువగా కనిపిస్తాయి. బొప్పాయి దిగుబడులు ఎక్కువగా రావడం, ధరలు బాగా ఉండడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.



మామిడి కాయలు లేక వెలవెలబోతున్న రైల్వేకోడూరు మామిడి మార్కెట్ యార్డు

బొప్పాయికి దళారీల పోటు..

బొప్పాయికి విపరీతంగా దళారీ పోటు ఉంది. ధరల విషయంలో దళారులు తల దూర్చడం, ధరలు లేవని మార్వాడీలతో రైతులకు చెప్పించడం ఇక్కడ పరిపాటిగా మారింది. దీంతో రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. దళారీ వ్యవస్థను రైల్వేకోడూరులో లేకుండా చేస్తే రైతులు నేరుగా మార్వాడీ వ్యాపారులకు తమ పంటను లాభసాటిగా అమ్ముకుంటారని పలువురు రైతులు చెబుతున్నారు. దళారీ వ్యవస్థను రూపుమాపాలంటే అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. మామిడి దిగుబడి రాకపోవడంతో కూలీలు బొప్పాయికి వచ్చి కూలీ పనులు చేసుకుంటున్నారు.

\- కొండేటి సుబ్రహ్మణ్యం, జంగిటివారిపల్లె, రైల్వేకోడూరు మండలం

ప్రస్తుత ధరలు రైతులకు మేలు..

ప్రస్తుతం బొప్పాయి ధరలు బాగా ఉన్నాయి. దిగుబడులు బాగా వచ్చాయి. దీంతో రైతులు ఆనందంగా ఉన్నారు. పెట్టిన పెట్టుబడులు బాగా వస్తాయి. రైతు కష్టానికి ఫలితం వస్తుంది. రైల్వేకోడూరు నియోజకవర్గంలో ప్రస్తుతం కొన్నిచోట్ల బొప్పాయి కోతలు జరుగుతున్నాయి. చాలా తోటల్లో కాయలు పక్వానికి రావాల్సి ఉంది. ధరలు ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయి. చేసిన అప్పులు తీరిపోతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మామిడి దిగుబడి రాకపోవడంతో బొప్పాయి పంట సాగు చేశా. మామిడిలో ఆశించినంత లాభాలు రావడం లేదు.

\- బి.భాస్కర్, రైతు జంగిటివారిపల్లె

సాధారణ విషయాన్ని రాజకీయం చేయొద్దు

అసత్య ప్రచారాలు చేయడం మంచి పద్ధతి కాదు : ఏఎస్పీ సుధాకర్


మాట్లాడుతున్న కడప ఏఎస్పీ సుధాకర్

కడప (క్రైం), జూన్ 1 : కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలోని శంకరాపురంలో రాత్రి సమయంలో కాలిన ద్విచక్ర వాహన ఘటనలో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని, దీనిపై అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ అడ్మిన్ లోసారి సుధాకర్ హెచ్చరించారు. కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో శనివారం ఆయన డీఎస్పీ ఎండీ షరీఫ్, చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 1న తెల్లవారుజామున 2 గంటల సమయంలో కడప నగరం శంకరాపురంలోని కొత్త రామాలయంవీధిలో నివాసం ఉంటున్న సిరికిరెడ్డి ప్రసాద్‌రెడ్డి అనే వ్యక్తికి చెందిన ఏపీ 04 ఏహెచ్ 2575 నెంబరు గల ద్విచక్ర వాహనం తన ఇంటి బయట పార్కింగ్ చేసి ఉండగా కాలిపోయిందన్నారు. ఈ విషయంపై ప్రసాద్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మోటారు సైకిలు ప్రమాదవశాత్తు తగలబడిందా లేక ఎవరైనా కక్షపూరితంగా తగలబెట్టారా అన్న విషయంపై సీసీ కెమెరాల పరిశీలన జరుగుతోందన్నారు. దీనిపై అన్నికోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితులను గుర్తించిన వెంటనే వారిని జైలుకు పంపడం తథ్యమన్నారు. ఈ ఘటన వెనుక ఎటువంటి రాజకీయ కోణం లేదన్నారు. పూర్తి సమాచారం తెలియకుండా అనవసరంగా సోషల్ మీడియాలో రంగుపులిమి దుష్ప్రచారం చేస్తే కారకులు కూడా బాధ్యులు కావాల్సి వస్తుందని హెచ్చరించారు.

స్కూటరుకు నిప్పంటించిన దుండగులు

పరిశీలించిన కడప టీడీపీ నేతలు


ద్విచక్ర వాహనాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి

కడప (క్రైం), జూన్ 1 : కడప నగరంలోని శంకరాపురంలో టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి తరపున బూత్ ఏజెంటుగా వ్యవహరించిన సిగిలి ప్రసాద్‌రెడ్డికి చెందిన ద్విచక్ర వాహనానికి గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. వాహనం పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఆ వాహనాన్ని పరిశీలించారు. టీడీపీ ఏజెంటు సగిలి ప్రసాద్‌రెడ్డిని విషయం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెచ్చగొట్టే చర్యలు మానుకోవాలన్నారు. ఈ విషయంపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్ని రెచ్చగొట్టే చర్యలు చేసినా మేము, మా కార్యకర్తలు శాంతియుతంగా ఉంటామన్నారు. ఈ మేరకు చిన్నచౌకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంక్రిమెంట్లు నిలిపివేయాలనుకోవడం అన్యాయం

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 1 : సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనని ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్లలో కోత పెట్టాలనుకోవడం అన్యాయమని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్ బాబు తెలిపారు. శనివారం కడప నగరం ఆర్‌జేడీ కార్యాలయంలో సూపరింటెండెంట్ సురేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు సజావుగా జరగడానికి ఉపాధ్యాయులంతా సమష్టిగా పనిచేశారని, దీనిని అధికారులు గుర్తించాలన్నారు. గతంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల కంటే ఈ ఎన్నికలు ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా నిర్వహించిన ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ కూడా రకరకాలుగా చెల్లించారన్నారు. ఉపాధ్యాయులకు చెల్లించిన రెమ్యునరేషన్ తేడాపై అధికారులు స్పందించలేదన్నారు. ఎన్నికల విధులకు హాజరు కాలేకపోయిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ ఆరోగ్య సమస్యలపై ఇంట్లో తల్లిదండ్రులు ఆరోగ్య పరిస్థితులు అలాగే పిల్లల ఆరోగ్య పరిస్థితుల కారణంగా హాజరు కాలేదని వారికి ఇంక్రిమెంట్లు కట్ చేయాలని భావిస్తున్న అధికారుల వైఖరి సరికాదన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎజాజ్ అహ్మద్, సుబ్బారావు, వీరనారాయణ, విశ్వనాద్, గంగన్నలు పాల్గొన్నారు.

ఫీజులు అరికట్టడంలో విద్యాశాఖ విఫలం

విద్యార్థి యువజన సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 1: ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అక్రమంగా వసూలు చేస్తున్న అధిక ఫీజులు అరికట్టడంలో విద్యాశాఖ పూర్తిగా విఫలమైందని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కడపలో శనివారం గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య కార్యాలయంలో జీఆర్ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశం జీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ సిద్దిక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బాబు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏటూరు లోకేశ్, పీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు దారా గోపి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీపీ నాగేంద్ర, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యవంశి, ఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్‌లు మాట్లాడారు. యూనిఫామ్స్, బుక్స్ ఇతర మెటీరియల్స్ విద్యాసంస్థలోనే అమ్మకానికి పెట్టినా పట్టీపట్టనట్లు విద్యాశాఖ అధికారులు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఈనెల 6న డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టడం, 8న ఆర్ఐవో కార్యాలయం వద్ద ఆందోళన, 10న ఆర్‌జేడీ కార్యాలయం వద్ద ఆందోళన, 12న కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహారదీక్షలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి యువజన సంఘాల నేతలు సురేంద్ర, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

దొంగ అరెస్టు : 195 గ్రాముల బంగారు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బంగారు నగలు, నిందితుడు

బద్వేలు రూరల్, జూన్ 1 : మండల పరిధిలోని బయనపల్లెలో గత నెల 26న బసిరెడ్డి వసుంధర అనే మహిళ ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో దొంగను అరెస్టు చేసి 195 గ్రాముల బంగారు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ విక్రమసింహ తెలిపారు. శనివారం స్థానిక రూరల్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బసిరెడ్డి వసుంధర ఇచ్చిన ఫిర్యాదు మేరకు బయనపల్లెలో ఇంటి ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో దిండు కింద ఉన్న ఇంటితాళాలు తీసుకుని దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. వారుతెలిపిన కొన్ని గుర్తుల మేరకు రూరల్ సీఐ రవికుమార్ సిబ్బందితో ప్రత్యేక టీం ఏర్పాటు చేసి గుమ్మళ్ల వెంకటసుబ్బయ్య అనే దొంగను అరెస్టు చేసి విచారించగా ఈ దొంగతనంలో అనుచరుడు కుమార్ కూడా సాయపడ్డాడని తెలిపాడన్నారు. అయితే కుమార్ పరారీలో ఉన్నట్లు అయన తెలిపారు.

నిందితుడు గుమ్మళ్ల వెంకటసుబ్బయ్యపై జిల్లాలోని ఎర్రగుంట్ల, బద్వేలు రూరల్, మైదుకూరు, ప్రొద్దుటూరు రూరల్, కడప టూటౌన్, కోవెలకుంట్ల స్టేషన్ల పరిధిలో ఒక్కొక్క దొంగతనం కేసు బద్వేలు అర్బన్ పోలీసుస్టేషన్ల పరిధిలో నాలుగు దొంగతనం కేసులు ప్రొద్దుటూరు త్రీటౌన్, బద్వేలు రూరల్, అట్లూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె, సంబేపల్లె, నందలూరు పోలీసుస్టేషన్లలో ఒక్కొక్క ఎర్రచందనం కేసులు, మైదుకూరులో రెండు ఎర్రచందనం కేసులు నమోదై ఉన్నాయన్నారు. ఇతడిపై గతంలో అట్లూరు పోలీసుస్టేషన్‌లో ఎర్రచందనం కేసులో పీడీ యాక్టుపై జైలుకు పంపగా సుమారు 9 నెలల పాటు కడప సెంట్రల్ జైలులో ఉండి బెయిలుపై విడుదలయ్యాడన్నారు. కేసును ఛేదించిన బద్వేలు రూరల్ సీఐ విక్రమసింహ, ఎస్ఐ రవికుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు ఆయన తెలిపారు.

రాజంపేటలో వర్ష బీభత్సం

- ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం
- నేలకొరిగిన అరటి, బొప్పాయి చెట్లు


ద్విచక్ర వాహనాలపై విరిగిపడ్డ చెట్టు

రాజంపేటటౌన్, జూన్ 1 : రాజంపేట మండల పరిధిలోని శనివారం సాయంత్రం పట్టణంలో తీవ్ర గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. అరగంటపాటు కురిసిన వర్షం ఎండ తాపంతో బాధపడుతున్న పట్టణవాసులకు ఊరట కలిగించిన విషయం అయినప్పటికీ రైతులకు తీరని విషాదం మిగిల్చింది. ఈదురుగాలులకు అరటి, బొప్పాయి తోటలు నేలకొరిగాయి. పట్టణంలో రోడ్లకు ఇరువైపులా ఉన్నచెట్లు, కొమ్మలు విరిగి రోడ్లపై పడ్డాయి. దీంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడింది. పట్టణంలోని కొత్త బస్టాండు సమీపంలో, ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద, నూనెవారిపల్లెలో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విరిగిన కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో పట్టణంలో పలు వీధులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రెండు ద్విచక్ర వాహనాలపై చెట్టు విరిగిపడంతో అవి పాక్షికంగా దెబ్బతిన్నాయి. పోస్టాఫీసు, పోలీస్‌స్టేషన్ సమీపంలో కాలువలలో పూడిక తీయకపోవడంతో ప్రధాన రహదారే కాలువలను తలపించింది. దీంతో రోడ్డుపై పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పట్టణంలోని ఇన్‌ఫ్యాంట్ జీసస్ స్కూల్లో ఉన్న షెడ్డు రేకులు గాలికి ఎగిరి పడ్డాయి. మండల పరిధిలోని పలు గ్రామాలలో అరటి, బొప్పాయి పంటలు నేలకొరిగాయి. ఈ ఏడాది అడపాదడపా కాసిన మామిడి కాయలు కూడా నేలరాలి రైతులు తీవ్రంగా నష్టపోయారు.


పోస్టాఫీసు వద్ద ప్రధాన రహదారిపై పారుతున్న వర్షం నీరు


ఈదురుగాలులకు ఎగిరిపడ్డ రేకులు


రాజంపేటలో రోడ్డుకు అడ్డంగా విరిగిపడ్డ చెట్టు

పటిష్టంగా కౌంటింగ్ ఏర్పాట్లు

- కౌంటింగ్ కోసం అన్ని విధాలా సన్నద్ధం
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో ఎస్పీ

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 1: కౌంటింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పటిష్టంగా పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ జరగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా చేపట్టామని, కౌంటింగ్ కోసం అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామన్నారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఏడు సెగ్మెంట్లతో ఒక పార్లమెంట్ స్థానం ఉందన్నారు. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంట్ సెగ్మెంట్లకు రాయచోటి జిల్లా కేంద్రంలో పటిష్టమైన భద్రతతో కౌంటింగ్ నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. పార్లమెంట్ పరిధిలోకి వచ్చే పుంగనూరు అసెంబ్లీ సెగ్మెంట్ కౌంటింగ్ చిత్తూరు జిల్లాలోనే జరుగుతుందని వివరించారు. కౌంటింగ్ కేంద్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ సెగ్మెంట్లకు 12 కౌంటింగ్ కేంద్రాలు, పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్‌కు విడిగా ఒక కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కౌంటింగ్ కేంద్రంలో కమ్యూనికేషన్ రూములు మీడియా ఫెసిలిటేషన్, బారికేడింగ్ ఇంటర్నెట్ సౌకర్యం తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ సాఫీగా జరిగేందుకు చర్యలు తీసుకున్నామని, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ మధ్యాహ్నం రెండు గంటలలోపు, మొత్తం ఫలితాల ప్రకటనను రాత్రి 7 గంటలలోపు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ఎస్పీ బి.కృష్ణారావు మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి అల్లర్లు, సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ తర్వాత కూడా జిల్లాలో మొబైల్ పికెట్స్, మొబైల్ పార్టీలను, నైట్ పెట్రోలింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. గొడవలు చేసే వారిని, రౌడీషీటర్లను గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు బైండోవర్ చేశామన్నారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘా ఉంచామని, జిల్లాలో 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా విజయవంతంగా చేయడానికి పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో డీఆర్వో సత్యనారాయణ, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌లో హింసకు తావివ్వరాదు

ఎన్నికల కౌంటింగ్‌లో ఎలాంటి హింసకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తి కావాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శాంతిభద్రతల పరిరక్షణపై రిటర్నింగ్ అధికారులు, డీఎస్పీలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీ జరిగే ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎంతమందిపై బైండోవర్ కేసులు విధించారు. రౌడీషీటర్లపై ఎలాంటి చర్యలు చేపట్టారు తదితర అంశాలపై డీఎస్పీలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమలు అవుతోందని, ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. 133 సెక్షన్ కింద రాళ్లు, రప్పలు, కర్రలు లాంటి ఇతరులకు హాని కలిగించేవి ఎవరూ పెట్టుకోకూడదన్నారు. లా అండ్ ఆర్డర్‌ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవడానికి వీలు లేదన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, ప్రజాతీర్పును స్వాగతించాలని, ఈ విషయం ప్రతి ఒక్కరూ గుర్తించి ఎటువంటి గొడవలు జరగకుండా సహకరించాలన్నారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్, డీఆర్వో సత్యనారాయణ, ఆర్వోలు, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూమి స్వాధీనం


ఫెన్సింగ్‌ను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

సిద్దవటం, జూన్ 1 : స్థానిక జగనన్న కాలనీ సమీపంలోని సర్వేనెంబర్ 432-6లో 1.50 ఎకరాల ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించుకుని మామిడి మొక్కలు నాటాడు. ఈ విషయంపై స్థానిక ప్రజలు సిద్దవటం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో ఆ మొక్కలను వెంటనే తొలగించాలని వీఆర్వో కేశవను ఆదేశించారు. దీంతో వీఆర్వో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన ముళ్ల కంచెను, మామిడి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నౌకరు పాల్గొన్నారు.

అన్నపై తమ్ముడు కత్తితో దాడి

సీకేదిన్నె, జూన్ 1: చింతకొమ్మదిన్నె మండలం జమాల్‌పల్లెకు చెందిన ఇంటి నిర్మాణం విషయంలో గొడవ జరిగింది. ఈ గొడవలో అన్న అక్బర్ ఇంటి నిర్మాణం చేసుకుంటుండగా తమ్ముడు బాషాఖాన్ స్థలం విషయంలో గొడవపడి కత్తితో పొడిచేందుకు ప్రయత్నించగా తప్పించుకునే ప్రయత్నంలో అన్న చేతికి గాయమైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన అక్బర్‌ను చికిత్స నిమిత్తం హుటాహుటిన రిమ్స్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు.

కువైత్‌లో గోపవరంవాసి మృతి



గోపవరం, జూన్ 1 : గోపవరం మండలంలోని చిన్నగోపవరానికి చెందిన బుర్రి వరదరాజు (40) కువైత్‌లో గుండెపోటుకు గురై శనివారం మృతి చెందాడు. గుండెనొప్పి రావడంతో వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. వైద్యచికిత్సలు పొందుతూ ఆయన మృతి చెందాడు. కొన్ని సంవత్సరాలుగా వరదరాజు కువైత్‌లోనే ఉంటున్నాడు. మూడు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చి మరలా కువైత్‌కు వెళ్లాడు. కాగా మృతుడికి భార్య గంగాదేవి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

విత్తన దుకాణాల ఆకస్మిక తనిఖీ

- రెండు దుకాణాలపై కేసు నమోదు


దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 1 : ప్రొద్దుటూరులోని రెండు విత్తనాల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు చేసి ఆ రెండు దుకాణాలపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఈదురుబాష తెలిపారు. తనిఖీలో భాగంగా శనివారం స్థానిక మైదుకూరు రోడ్డులోని విత్తనాల దుకాణాలను అకస్మికంగా తనిఖీ చేశామన్నారు. భారతి సీడ్ ఏజెన్సీస్, శ్రీవేంకటేశ్వర సీడ్స్ ఏజెన్సీస్‌లో విత్తనాల రికార్డులను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీలలో భాగంగా అన్ని రికార్డులు,నిల్వలకు స్వల్పతేడాలు ఉన్నందున శ్రీభారత్ సీడ్స్ ఏజెన్సీస్‌లో 2256 కేజీలు విలువ రూ3,10,200లు సంబంధించిన వివరాలు రికార్డులలో సక్రమంగా నమోదు లేనందున నోటీసు ఇచ్చామన్నారు. శ్రీవేంకటేశ్వర సీడ్స్ ఏజెన్సీస్‌లో 0.729 కేజీలు చిల్లి నారోలి ఎన్ఎస్264 విలువ రూ.92,200లు గాను దుకాణయజమానికి అమ్మకం నిలుపుదల నోటిసు ఇవ్వడమైందని ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో బాలంగాధర్‌రెడ్డి, అగ్రికల్చర్ అధికారులు శ్రీనివాసులు, మురళీకృష్ణ, సుస్మిత పాల్గొన్నారు.

హోటళ్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు




అభిరుచి హోటల్‌లో వ్యర్థాల పక్కన మాంసం ఉన్నదృశ్యం - బృందావన్ హోటల్ వద్ద టేస్టింగ్‌సాల్ట్‌ను చూపిస్తూ మాట్లాడుతున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత

జమ్మలమడుగు, జూన్ 1: జమ్మలమడుగులోని కొన్ని హోటళ్లు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నాయని విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులో అభిరుచి హోటల్, తాడిపత్రి రోడ్డులోని బృందావన్ హోటల్‌తో పాటు మరికొన్నింటిపై దేవగుడి గ్రామానికి చెందిన రామాజి ఇమ్మానుయేల్ జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జమ్మలమడుగు ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ హరిత ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11.30 గంటల నుంచి దాడులు నిర్వహించారు. మొదట అభిరుచి హోటల్‌ను సందర్శించారు. వ్యర్థాల మధ్య మాంసపు ముద్దలు దర్శనమిచ్చాయి. తర్వాత ఫ్రిజ్‌లో స్టాక్ ఉన్న మాంసాన్ని కిందకు దించి చూశారు. మాంసం రెండు నుంచి 4 రోజులు స్టాక్ ఉన్నట్లుగా గుర్తించారు. కాగుతున్న నూనెను తనిఖీ చేశారు. అక్కడ తయారు చేసి ఆహారాలపై మూతలు లేకపోవడంతో ఈగలు దర్శనమిచ్చాయి. వెంటనే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తినే ఆహారాలపై మూతలు లేవని, ఆవరణంలో అపరిశుభ్రంగా ఉందని, మాంసానికి సంబంధించి ఏరోజుకారోజు బిల్లులు లేకపోవడం తదితర వాటికి సంబంధించి యజమానికి నోటీసు అందజేశారు. అనంతరం బృందావన్ హోటల్‌లో తనిఖీ చేశారు. ఆహారం తయారు చేసే చోట ఈగలు ఎక్కువగా ఉన్నాయి. దానిపక్కనే టేస్టింగ్ సాల్ట్ స్వాధీనం చేసుకున్నారు. నూనె, ఇతర ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. మాంసానికి సంబంధించిన బిల్లు కావాలని అడిగారు. ఆ హోటల్ యజమానిలో ఒకరు మాట్లాడుతూ.. దాదాపు 10 సంవత్సరాల నుంచి ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తమ వద్దకు రాలేదని, ఇంతవరకు తనిఖీలు చేయలేదని చెప్పారు. నిషేధిత టేస్టింగ్‌సాల్ట్ వినియోగించడం వలన ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడినట్లేనని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కేసు నమోదు చేస్తామన్నారు. హోటల్ యజమానులతో మాట్లాడి నోటీసు అందించారు. ఆ రెండు హోటళ్లలో తనిఖీలు చేసి అనుమానం వచ్చిన ఆహార పదార్థాలను టెస్టింగ్‌కోసం పంపించామని, 14 రోజుల్లో వాటి ఫలితాలు వచ్చాక చర్యలు తీసుకుంటామని అన్నారు.


సుండుపల్లె:అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ప్రసాద్‌బాబు


కోడూరు: కిటకిటలాడుతున్న ఆలయం, వెండి కవచం అలంకరణలో హనుమంతుడు


ఓబులవారిపల్లె: పూజలు చేస్తున్న ముక్కా రూపానంద రెడ్డి

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

రాయచోటిటౌన్, జూన్1: పట్టణంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు రాయచోటి పట్టణంలోని ప్రసన్నఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొని పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. దిగువ అబ్బవరం, గరుగుపల్లె, బొట్లచెరువు, కుమ్మరపల్లె, మాధవరం, మాసాపేట, ఎస్ఎన్‌కాలనీ తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో వేడుకలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు.

రైల్వేకోడూరు: పట్టణంలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో ఉదయం పంచామృతాభిషేకం చేశారు. ఆలయ ధర్మకర్త కలపాటి వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయంలో ఉన్న ఆంజనేయస్వామికి వెండికవచం తొడిగి పూలతో అలంకరించారు. వినాయకుడు, నవగ్రహాలు, రావి చెట్టు దగ్గర ఉన్న నాగేంద్రుడు, శివుడు తదితర విగ్రహాలకు భక్తులు పూజలు చేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు: స్థానిక పెద్దూరు బ్రాహ్మణవీధిలోని దక్షిణ ముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం అభిషేకాలు, తమలపాకుల తో పూజలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఆంజనేయస్వామి ఆలయాలు జై హనుమాన్ నామస్మరణతో మార్మోగాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

సుండుపల్లె: చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీ సానిపాయి మర్రిచెట్టు దగ్గర ఉన్న అభయాంజనేయ స్వామికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.


రామాపురం: మండలంలోని అంజనేయస్వామి ఆలయాల్లో హనుమంతుడికి ఆకుపూజ, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో అన్నదానం చేశారు. యర్రమరెడ్డిగారిపల్లెలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు.

రాజంపేట టౌన్ : పట్టణంలోని హనుమాన్ మందిరంలో, మన్నూరు, ఆకులవీధి, పోలి చెరువు వద్దవున్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం, డీబీఎస్‌పల్లె హనుమాన్ ఆలయాల్లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని తమలపాకులు, వడమాల, వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

నందలూరు: మండలంలోని అరవపల్లెలోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, హనుమద్ వ్రతం, మధ్యాహ్నం అన్నప్రసాదాల వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ ఊరేగింపు నిర్వహించారు. గ్రామోత్సవంలో సీతారామ, లక్ష్మణ, హనుమాన్ వేషధారణలు భక్తులను ఆకర్షించాయి. టీడీపీ నేతలు మేడా విజయశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచు సమ్మెల శివప్రసాద్, జనసేన నాయకులు శివరామరాజులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఒంటిమిట్ట: కోదండరామాలయం ఎదురుగావున్న సంజీవరాయ ఆలయం లో, జాతీయ రహదారి ఆనుకుని వున్న నడింపల్లెలోని అభయాంజనేయస్వామి ఆలయంలో, చెరువుకట్టపై వెలసిన స్వయంభు వీరాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ జయంతి వేడుకలకు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని హనుమాన్‌ను దర్శించుకున్నారు.

ఓబులవారిపల్లె: రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి మండలంలోని బెస్తపల్లె, ముక్కావారిపల్లె, బొమ్మవరం గ్రామాల్లో అంజ నేయస్వామికి పూజలు నిర్వహించారు. బొమ్మవరంలో ఆయనతోపాటు భార్య వరలక్ష్మి, కూటమి అభ్యర్థి అరవ శ్రీదర్, టీడీపీ యువ నాయకులు పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ తమ్మిద తిరుపాలు, బీజేపీ నియోజక వర్గం ఇన్‌ఛార్జ్ గడ్డం చెంగల్‌రాజు, చిన్న ఓరంపాడు కమ్మపల్లె టీడీపీ నాయకులు నాగినేని రమేష్‌నాయుడు, బొమ్మవరం సీనియర్‌నాయకులు ఉమ్మలరాజు పిచ్చిరాజు, సుబ్బరాజు, పాముూరు రంగారెడ్డి, ముక్కా రూపానందరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


గాలివీడులో పూజలందుకున్న హనుమంతుడు


డీబీఎస్‌పల్లెలో ప్రత్యేక అలంకరణలో అంజనేయస్వామి


నందలూరు: ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయుడు


రాయచోటి: ప్రత్యేక అలంకరణలో మాసాపేట గుండాంజనేయస్వామి


డ్రైఫ్రూట్స్ అలంకరణలో ప్రసన్న అంజనేయస్వామి మూలవిరాట్


రాయచోటి: హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి


విత్తన కాయల నాణ్యత పరిశీలిస్తున్న జేడీఏ చంద్రా నాయక్

సుండుపల్లె, జూన్ 1: సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని జేడీఏ చంద్రానాయక్ సూచించారు. మండలంలోని సుండుపల్లె -2 రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ విత్తనకాయల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన కాయలు తీసుకున్న ప్రతి ఒక్క రైతు కూడా ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. లేకుంటే విత్తనం ధర తిరిగి చెల్లించాలని, అలాంటి రైతులు ప్రభుత్వ పథకాలకు అనర్హులు అవుతారని తెలియజేశారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది వేరుశనగ విత్తనాల నాణ్యతను పరిశీలించి ఆర్బీకే సిబ్బంది సూచించారు.. అధికారులు ఎటువంటి అలసత్వం వహించినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏవో రమేశ్‌రాజు, ఆర్బీకే సిబ్బంది మల్లికార్జున, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలి


గిరిజనులతో మాట్లాడుతున్న దార్ల రాజశేఖర్

రైల్వేకోడూరు, జూన్ 1: ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని మండల సీపీఐ కార్యదర్శి దార్ల రాజశేఖర్ డిమాండ్ చేశారురు. శనివారం అనంతరాజుపేట గ్రామ పంచాయితీ పరిధిలోని నారాయణరాజుపోడు గిరిజనకాలనీలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద దళిత, గిరిజనులకు ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పోరాటాల ఫలితంగా పేదలకు భూములు పంపిణీ చేశారన్నారు. చంద్రబాబు, వైఎస్ జగన్ ప్రభుత్వాల్లో భూములను పంచిన పాపాన పోలేదన్నారు. దళితులు, గిరిజనులకు భూములు ఇవ్వాలని ఈ నెల 10న రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి మొగిలి వినయ్, నారాయణ రాజు పోడు గిరిజన కాలనీ వాసులు చంగయ్య, సుబ్బరాయుడు, వెంకటేష్, ఈశ్వరమ్మ, వెంకటమ్మ, సుభాషిని, గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

మందగిరి ఆలయంలో ఎన్‌డీఏ నేతల పూజలు

సిద్దవటం, జూన్ 1: చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావాలంటూ టీడీపీ నాయకులు శనివారం కనుమలోపల్లె సమీపాన వున్న మందగిరి శనేశ్వరాలయంలో పూజలు నిర్వహించి 101 కొబ్బరి కాయలను కొట్టారు. రాజంపేట నియోజక వర్గం నుంచి టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం అఖండ మెజార్టీలో గెలుపొందాలని పూజలు చేశారు. ఆలయ అర్చకులు ప్రధాని నరేంద్రమోడీ, చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ గోత్ర నామాలపై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు కుప్పల వెంకటసుబ్బయ్య, జనసేన పార్టీ రాష్ట్ర చేనేత కార్యదర్శి రాటాల రామయ్య, ఎన్‌డీఏ నేతలు పార్లమెంటు ఉపాధ్యక్షులు పత్తా రామచంద్రయ్య, ఉమ్మడి తెలుగుదేశం పార్టీ నేత కాడే చెంయ్యనాయుడు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి సలహా కమిటీ మెంబర్ మల్లు వెంకటసుబ్బారెడ్డి, వాణిజ్య రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి గంజి సుబ్బరాయుడు, పార్లమెంటు వాణిజ్య విభాగపు కార్యదర్శి ఎన్ఆర్ఐ చంద్ర ,రాజంపేట నియోజక వర్గ యువ నాయకులు రాజానాయుడు, అసెంబ్లీ క్యాదర్శి రామ్మోహన్‌నాయుడు, మాజీ సర్పంచు రాజశేఖర్‌యాదవ్, బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పొట్ట శివ, తెలుగు యువత ఉపాధ్యక్షుడు నాగభూషణం, పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు జింక శివ, ముస్లిం మైనార్టీ మండల నేత మహబూబ్ బాషా, కొండు విజయ్, బండి ఓబులేసు, ఎద్దుల శ్రీనివాసులు, బీజేపీ మండల కార్యదర్శి భాస్కర్‌రెడ్డి తదితర ఎన్‌డీఏ కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు


ఇసుక రీచ్‌లను తనిఖీ చేస్తున్న అధికారులు

రాజంపేట టౌన్, జూన్ 1 : అక్రమంగా ఇసుకను తరలిస్తే కటిన చర్యలు తీసుకుంటామని ఎస్‌బి ఇన్ స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు, ఎస్ఈబి, మైన్స్ అండ్ జి యాలజీ, పంచాయతీ రాజ్, రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్‌టీవో, ఆర్ డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్‌లకు చెందిన మండల లెవెల్ సౌండ్ కమిటీ ఆధ్వర్యంలో రాజంపేట పరిధిలోని చెయ్యేరు నదిపై వున్న బాలరాజు పల్లె, శేషమాంబపురం, మందరం, నారాయణనెల్లూరు, కోమంతరాజపురం, టంగుటూరు, కుమారునిపల్లె ఇసుక రీచ్‌లను సుప్రీంకోర్టు నిబంధనల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తవ్వితే కఠిన చర్యలు తీసకుంటా మన్నారు. అక్రమ ఇసుక తవ్వకాలు గుర్తిస్తే 9440902595 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మైన్స్ అండ్ జియాలజీ ఆర్ఐ హమీదబాను, ఎంవీఐ వినోద్, ఎస్ఐ సుభాస్‌చంద్రబోస్, ఈఎస్ఐ సంధ్య, ఏఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ గిరిధర్ పాల్గొన్నారు.

అన్నమాచార్య అధ్యాపకుడికి డాక్టరేట్


ప్రసాద్

రాజంపేట, జూన్ 1: తమ కళాశాలలో ఈఈఈ విభాగంలో అధ్యాపకుడుగా పని చేస్తున్న పాపుగారి భాస్కర్ ప్రసాద్‌కు జేఎన్‌టీయూ అనంతపురం పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ డైనమిక్ బిహేవియర్ ఆఫ్ సింగిల్ ఫేజ్ ఇండక్షన్ మోటార్ విత్ రెనివబుల్ ఎనర్జీ సోర్సెస్ ఫెడ్ రీబూస్ట్ కన్వర్టర్ విత్ డిఫరెంట్ కంట్రోలర్స్ అనే అంశంపై పరిశోధన చేశాడన్నారు

ఫార్మాడీ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు


విద్యార్థుల అభినందనసభలో యల్లారెడ్డి

రాజంపేట, జూన్ 1: అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో శనివారం ఫార్మాడీ విద్యార్థుల వీడ్కోలు ఉత్సవాలు నిర్వహించారు. ఆరేళ్ల ఫార్మాడీ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు జూనియర్లు వీడ్కోలు పలికారు. కళాశాల వైస్ చైర్మన్ యల్లారెడ్డి వారికి అభినందనలు తెలిపారు.

'గాలివీటి'కి 'గడికోట' పరామర్శ


సురేంద్రారెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

రామాపురం, జూన్1: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిట్లూరు గ్రామానికి చెందిన టీడీపీ నేత గాలివీటి సురేంద్రారెడ్డి శస్త్ర చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి శనివారం ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సురేంద్రారెడ్డి త్వరగా కోలుకొని ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు.

పాఠశాల నిర్వహణ గ్రాంట్‌ను సకాలంలో చెల్లించాలి

● అపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న జీవీ సత్యనారాయణ

రాయచోటిటౌన్, జూన్1: పాఠశాల నిర్వహణ గ్రాంటును సకాలంలో చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో అపస్ అన్నమయ్య జిల్లాశాఖ అభ్యాస వర్గ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా నిధులు విడుదల చేయకపోవడంతో పాఠశాల నిర్వహణ చాలా కష్టతరంగా మారిందన్నారు. ఫలితంగా ప్రభుత్వం ఆశించిన రీతిలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అవకాశం తక్కువగా ఉందన్నారు. కావున విద్యాశాఖ వెంటనే బకాయిలతో పాటు రాబోయే విద్యా సంవత్సరం గ్రాంట్‌ను కూడా విడుదల చేసి పాఠశాలలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం అపస్ జిల్లా గౌరవాధ్యక్షుడు పరశురాం, జిల్లా అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలను సకాలంలో పాఠాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు, దివాకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన పాత బకాయిలను వెంటనే చెల్లించాలని తెలిపారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి మాట్లాడుతూ పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే క్లియర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్య క్షుడు ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి బాలాజీ, జిల్లా కోశాధికారి శివ శంకర్, జిల్లా మీడియా ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యాలయ ప్రముఖరెడ్డి, ప్రసాద్, జిల్లా మహిళా కన్వీనర్ సుశీల, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణవేణి, కవిత, సేవా కన్వీనర్ మల్లయ్య, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేతల గృహ నిర్బంధం


టీడీపీ నేత ఇంటి వద్ద పోలీసు బందోబస్తు

ఒంటిమిట్ట, జూన్ 1: కౌంటింగ్ నేపథ్యంలో శనివారం ఉదయం నుంచి మండలంలోని టీడీపీ సీనియర్ నేత కొమర వెంకటనరసయ్య, వైసీపీ నేత ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిని పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. ఒక్కొక్కరి చొప్పున హెడ్ కానిస్టేబుళ్ళను వారి ఇంటి వద్ద నియమించారు. నిఘా వర్గాల సమాచారం మేరకు ఇరు పార్టీల నాయకులను గృహ నిర్బంధంలో ఉంచామని, ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

నందలూరు ప్రీమియర్ లీగ్‌లో సెమీఫైనల్‌కు మంటపంపల్లె జట్టు

నందలూరు,జూన్ 1 : నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్‌లో భాగంగా అరవపల్లెలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న ఓపెన్‌టు ఆల్ హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంటులో శనివారం జరిగిన మ్యాచ్‌లో టీవీ పురం జట్టుపై మంటపంపల్లె ముద్దుకృష్ణ లెవెన్స్ జట్టు విజయం సాధించి సెమీ ఫైనల్లోకి ప్రవేశించింది. మొదట బ్యాటింగ్ చేసిన ముద్దుకృష్ణజట్టు 14 ఓవర్లలో 7 వికెట్లను కోల్పోయి 165 పరుగులు చేసింది. వాలి 42, ఎం. సాయి 44 పరుగులు చేశారు. అనంతరం విజయం కోసం బరిలో దిగిన టీవీపురం జట్టు 12.3 ఓవర్లలో 87 పరుగులకు ఆలౌటైంది. ముద్దుకృష్ణ జట్టు బౌలర్ 2 ఓవర్లు వేసి రెండు వికెట్లు, ఆస్కరి 3 ఓవర్లు వేసి 3 వికెట్లు తీశాడు. సాయి 44 పరుగులు చేయడంలోపాటు రెండు వికెట్లను పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను అందుకున్నారు. ఈ మ్యాచ్‌కు జాతీయ వికలాంగ క్రికెట్ క్రీడాకారుడు శివకోటి, క్రికెట్ క్రీడాకారుడు మున్నా అంపైర్లుగా, అఫ్సర్, దినేష్‌లు స్కోరర్లుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్, రంజిత్, క్రీడాకారులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం రైజింగ్ స్టార్, గాంధీ నగర్ జట్ల మధ్య మొదటి సెమీ ఫైనల్, మధ్యాహ్నం మంటపంపల్లె ముద్దుకృష్ణ జట్టు, కింగ్స్ డాబా మంటపంపల్లె జట్ల మధ్య రెండవ సెమీఫైనల్ జరుగనుంది.

రాయచోటిలో కనపడితే కేసులే..

కలికిరి, జూన్ 1: లెక్కింపు జరిగే రోజు పీలేరు నియో జకవర్గీయులు ఎవరైనా రాయచోటిలో కనపడితే కేసులు పెడతామని, నాన్ బెయిలబుల్ సెక్షన్లు వర్తిస్తాయని పీలేరు నియోజక వర్గం శాంతి భద్రతల ప్రత్యేక డీఎస్పీ మోహన్ రావు హెచ్చరించారు. గుర్తింపు కార్డులు లేని వారు ఎన్నికల విధుల సమయంలో రాయచోటిలో తిరిగి అనవసర సమస్యలు కొని తెచ్చుకోవద్దని హితవు పలికారు. కౌంటింగ్ సందర్భంగా పోలీసులు చేపడుతున్న ప్రత్యేక చర్యల గురించి వివరిస్తూ పోలీసు స్టేషన్‌లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, నేతలు, కార్యకర్తలకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. కరోనా లాక్‌డౌన్ తలపించేలా అప్రకటిత కర్ఫ్యూ వుంటుందన్నారు. దేశం మొత్తం మీద అత్యధిక పోలింగ్ జరిగిన రాష్ట్రంగా ఏపీ గుర్తింపు తెచ్చుకుందని, ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవల్లో కూడా మొదటి స్థానం లోకి రావడం దురదృష్టకరమన్నారు. ఫలితంగా లెక్కలేనంత మంది పోలీసులు, అధి కారులు సస్పెండయ్యారన్నారు. ఎన్నికల నియమావళి అమలులో వున్న 6వ తేదీ వరకూ ఎలాంటి ఊరేగింపులు, బహిరంగ సంబరాలను అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. రాయచోటిలో బయటి వ్యక్తులకు ఆశ్రయం కల్పించకూడదని అన్ని లాడ్జిలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. నాన్ లోకల్ వ్యక్తులు కనిపిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. మూడు రోజులపాటు మద్యం దుకాణాలు మూసేస్తామని, మద్యం సేవించి బహిరంగంగా కనపడితే కేసులు నమోదు చేస్తామన్నారు. కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆర్.మోహన్, ఎస్ఐ దేవేంద్రకుమార్, ఏఎస్ఐలు, హెచ్‌సీ, పోలీసు సిబ్బంది, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మూడు టిప్పర్లు..ఆరు ట్రాక్టర్లు

● మదనపల్లెలో జోరుగా ఇసుక, మట్టి అక్రమ రవాణా
● ఎన్నికల విధుల్లో అధికారులు



శుక్రవారం రాత్రి పట్టుబడిన ఇసుక ట్రాక్టర్, శనివారం పట్టణంలో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న టిప్పర్

మదనపల్లె టౌన్, జూన్ 1: ఎన్నికల విధుల్లో అటు రెవెన్యూ, ఇటు పోలీసు అధికారులు ఉండటం, మైనింగ్ అధికారుల ఆచూకీ లేకపోవడంతో మదనపల్లెలో ఇసుక, మట్టి అక్రమ రవాణా మూడు టిప్పర్లు..ఆరు ట్రాక్టర్లు అన్న చందంగా జోరుగా సాగుతోంది. మదనపల్లెలో భవన నిర్మాణాల వేగం పెరిగింది. పట్టణంలో ఎంత లేదన్నా 100 చోట్ల భవనాలు, ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటి కోసం ఇసుక, మట్టి అవసరం ఉండటం, దూర ప్రాంతాల్లోని ఇసుక రీచ్‌లు మూతపడటంతో స్థానికంగా ఇసుక వ్యాపారుల పంట పండుతోంది. మదనపల్లె పట్టణానికి నిత్యం 200 ట్రాక్టర్ల ఇసుక, 100 టిప్పర్ల ఎర్రమట్టి అక్రమంగా రవాణా అవుతోంది. మదనపల్లె మండలంలోని చీకిలబైలు, వేంపల్లె, చిప్పిలి సమ్మర్‌స్టోరేజి ట్యాంకు, సీటీఎం పెద్దచెరువు, పోతబోలు చెరువు, నిమ్మనపల్లె మార్గంలోని బాహుదా ప్రాజెక్టు, పెంచుపాడు రోడ్డులోని కోటవారిపల్లె చెరువు, పొన్నేటిపాళెం పెద్దవంక నుంచి ఇసుక వ్యాపారులు ట్రాక్టర్లలో ఇసుకను రాత్రిళ్లు అక్రమంగా రవా ణా చేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుక డిమాండ్‌ను బట్టి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇదిలా వుండగా ఇసుక ట్రాక్టర్లతో మట్టి, ఇసుక అక్రమ రవాణా ఆలస్యం కావస్తుండడంతో కొందరు చిన్న టిప్పర్లతో మట్టి, ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఈ టిప్పర్లకు కనీసం రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లు కనపడకుండా పీకేసి అక్రమ రవాణా చేస్తున్నారంటే వీరికి అడ్డూఅదుపు లేదనటానికి నిదర్శనంగా చెప్పవచ్చు. పట్టణంలో నిత్యం టిప్పర్లు బహిరంగంగానే అక్రమ రవాణా చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. బెంగళూరు రోడ్డులోని వేంపల్లె వద్ద ప్రభుత్వ పొరంబో కు స్థలంలో ఉన్న గుట్ట వద్ద ఎక్స్‌కవేటర్లు పెట్టి మట్టిని తవ్వి టిప్పర్లతో రవాణా చేస్తున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

మదనపల్లె మండలం చిప్పిలి సమ్మర్ స్టోరేజి ట్యాంకు నుంచి శుక్రవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎస్ఈబీ పోలీసులు పట్టుకున్నారు. నక్కలదిన్నెకు చెంది న ముగ్గురి ట్రాక్టర్లు రోజూ ఇసుక అక్రమ రవాణా చేస్తున్నాయి. ఈ క్రమంలో రెవెన్యూ, పోలీసు అధికారులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉండడంతో స్థానికులు ఎస్ఈబీ ఎస్ఐ రాముడుకు సమాచారం అందించారు. దీంతో ఆయన తన సిబ్బందితో వెళ్లి అక్రమంగా ఇసుక రవాణా చే స్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని మదనపల్లె తాలూకా పోలీసులకు అప్పగించారు. ఇసుక అక్రమరవాణా విషయమై తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి ఇసుక ట్రాక్టర్ల యజమానులకు జరిమానా విధించే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

అర్ధగిరిలో ఘనంగా హనుమజ్జయంతి



హోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

తవణంపల్లె, జూన్ 1: అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, పంచామృత అభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సహస్రనామ హోమం చేశారు. భక్తులకు దర్శనం కల్పించి, స్వామివారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మాలధారణ చేసిన భక్తులు ఇరుముడి చెల్లించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి, మేళతాళాల నడుమ ప్రాకారోత్సవం నిర్వహించారు.సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కాణిపాకంలో..



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఈవో వెంకటేశు

ఐరాల(కాణిపాకం): జిల్లావ్యాప్తంగా శనివారం హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. కాణిపాక వరసిద్ధుడి అనుబంధమైన వీరాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం మూల విరాట్‌కు అభిషేకం చేశారు. తమలపాకులు, వడమాలలతో స్వామిని అలంకరించారు. స్వామికి ఆలయ ఈవో వెంకటేశు పట్టువస్త్రాలు, పూజా సామగ్రి అందించారు. వేడుకలను తిలకించడానికి భారీ సంఖ్యలో భక్తులు విచ్చేశారు. రాత్రి సీతారామ, లక్ష్మణ సమేత హనుమంతస్వామి ఉత్సవ విగ్రహాలను కాణిపాక వీధులలో ఊరేగించారు. ఏఈవో హరిమాధవరెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలు నిషేధం

ధ్రువీకరణ పత్ర స్వీకరణకు విజేతతోపాటు ఇద్దరికే అనుమతి

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 1: ఓట్ల లెక్కింపు అనంతరం విజయోత్సవ ర్యాలీలు, ప్రదర్శనలు, ఊరేగింపులు నిర్వహించరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపువేళ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వెల్లడించారు.

- ఐదుగురు కలిసి సమావేశాలు నిర్వహించరాదు. బాణసంచా, ఆయుధాలు, మందుగుండు సామగ్రిని బహిరంగంగా ప్రదర్శించరాదు. కౌంటింగ్ జరిగే ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణానికి సమీపంలో ఆయుధాలు కలిగి ఉండరాదు.
- ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన పూర్తయ్యే వరకు లెక్కింపు కేంద్రం ఆవరణలో ఊరేగింపులు, నినాదాలు, అరుపులు, ఆర్భాటాలు చేయడానికి వీల్లేదు. పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, లౌడ్ స్పీకర్లు ఉపయోగించడం నిషేధం, బహిరంగ ప్రదేశాల్లో బాణసంచా కాల్చరాదు.
- ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఏవైనా సందేహాలు వస్తే అక్కడి అభ్యర్థి లేదా ఏజెంట్లు ఆర్వో దృష్టికి తీసుకెళ్లాలి. హద్దుమీరి అల్లర్లకు పాల్పడే వారిని కేంద్రం నుంచి బయటకు పంపడమే కాకుండా అరెస్టు చేసేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది.
- ధ్రువీకరణ పత్రం స్వీకరించేందుకు విజేతతోపాటు ఇద్దరు వ్యక్తులను మాత్రమే అనుమతిస్తారు. లెక్కింపు కేంద్రం లోపలికి జిల్లా ఎన్నికల అధికారి లేదా ఆర్వో జారీచేసిన గుర్తింపు కార్డులు, కారు పాస్‌లు ఉన్న వారిని మాత్రమే అనుమతిస్తారు. కేంద్రంలోకి ఒక్కసారి వచ్చిన తర్వాత ప్రక్రియ పూర్తయ్యేంత వరకు లోపలే ఉండాలి. సెల్‌ఫోన్లు అనుమతించరు.

పాఠశాల, కళాశాల బస్సులను ఎఫ్‌సీ చేసుకోండి



స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ రాజేశ్వరరావు

చిత్తూరు సిటీ, జూన్ 1 : పాఠశాల, కళాశాల బస్సులను ఎఫ్‌సీ చేసుకోవాలని డీటీసీ నిరంజన్ రెడ్డి సూచించారు. శనివారం డీటీసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జూన్‌లో విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాల, కళాశాల యాజమాన్యాలు తమ బస్సులను పక్కాగా సిద్ధం చేసుకోవాలని చెప్పారు. జిల్లాలో 840 బస్సులుండగా కేవలం 400 మాత్రమే ఎఫ్‌సీలు చేసుకున్నాయని పేర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభమైన తర్వాత ఎఫ్‌సీ లేని బస్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి



వెంకటమ్మ (ఫైల్ ఫొటో)

వెదురుకుప్పం, జూన్ 1: వడదెబ్బతో మండలంలోని వావిలిచేను గ్రామానికి చెందిన తాతిరెడ్డి నరసింహారెడ్డి భార్య వెంకటమ్మ(74) మృతిచెందింది. శుక్రవారం ఆమె పొలానికి వెళ్లి వస్తుండగా ఎండల తాకిడికి సొమ్మసిల్లి పడిపోయింది. స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించిగా చికిత్స పొందుతూ శనివారం మరణించిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

వాహనం ఢీకొని లైన్‌మ్యాన్ మృతి



మృతిచెందిన ఉదయ్‌కుమార్ రెడ్డి

గంగాధరనెల్లూరు, జూన్1: గుర్తు తెలియని వాహనం ఢీకొని సచివాలయ లైన్‌మ్యాన్ మృతిచెందిన ఘటన శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సీఐ శంకర్ వివరాల మేరకు.. వేపంజేరి పంచాయతీ సర్విరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి కుమారుడు ఉదయ్‌కుమార్ రెడ్డి (26) చిత్తూరు మండలం తాళంబేడు, సచివాలయంలో లైన్‌మ్యాన్‌గా పనిచేస్తున్నారు. చిత్తూరు నగరంలోని షైదా ఫ్యాక్టరీ వద్ద కాపురం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి తాళంబేడు గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో గ్రామస్తులు ఆయనకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. మరమ్మతులు చేసి తిరిగి వస్తుండగా సుందరరాజపురం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకుని ఉదయ్ కుమార్ రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మధురమలై కొండలో ఏనుగుల మకాం



ఇరికిపెంట సమీపంలో మామిడి చెట్లను విరిచేసిన ఏనుగులు

సోమల, జూన్ 1: సోమల మండలంలో సంచరిస్తున్న ఏనుగుల మంద శనివారం రాత్రి ఇరికిపెంట సమీపంలోని మధురమలై కొండలో మకాం వేసినట్లు రైతులు తెలిపారు. కొండ దిగువన ఉన్న ఇర్లపల్లె సమీపం నుంచి మధురమలై కొండకు వెళ్లాయి. ఈ మార్గంలోని మామిడి, టమోటా తోటల్లో సంచరించాయి. నంజంపేట, సరస్వతీపురం, అడుసుపల్లె, గుంతచెరువుపల్లెలో తిరగాడి ఈ కొండలోనే మకాం వేశాయి. దీంతో మేకలు, పశువులు, గొర్రెల కాపరులు కొండకు వెళ్లడానికి భయపడుతున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.93 కోట్లు

తిరుమల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.93 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 67,873 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 33,532 మంది తలనీలాలు సమర్పించారు.

టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు శనివారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. చెన్నైకి చెందిన కిరోరిమల్ కాశీరామ్ మార్కెటింగ్ అండ్ ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ విరాళాన్ని అందించింది. శ్రీవారి ఆలయం ముందు సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర ఈ విరాళం డీడీలను టీటీడీ ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

కుప్పంలో భారీ వర్షం

జోరు వానలోనూ తగ్గని వేసవి తాపం



కుప్పం రోడ్లపై ప్రవహిస్తున్న వాననీరు



కూలిన ట్రాన్స్‌ఫార్మర్



నేలకూలిన భారీ వృక్షం

కుప్పం, జూన్ 1: కుప్పంలో శనివారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. అయినా వేసవి తాపం ఏమాత్రం తగ్గకపోవడంతో జనం ఎప్పటిలాగే ఉక్కపోతతో అల్లాడిపోయారు. ఉదయం నుంచి మబ్బులు కమ్ముకున్నా ఉష్ణోగ్రతలు 31 నుంచి 36 డిగ్రీల దాకా నమోద య్యాయి. మధ్యాహ్నం మీదట ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు ప్రారంభమయ్యాయి. సాయంత్రం భారీ స్థాయిలో వర్షం ప్రారంభమైంది. జోరుగా కురవడంతో కుప్పంలోని వీధులు జలమయమయ్యాయి. మురుగు కాలువలు రోడ్ల మీదకు పొంగిపొర్లాయి. పట్టణంలోని మూడు రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద వాన నీటితోపాటు మురుగునీటి నిల్వలు కూడా నిలబడిపోయి చిన్నపాటి చెరువులను తలపించాయి. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్తు సరఫరా లేకపోవడం, బయటకు వచ్చే వీలుకాకపోవడంతో కుప్పం ప్రజలు ఇళ్లలోనే ఉక్కపోతతో మగ్గిపోవాల్సి వచ్చింది.

కూలిన ట్రాన్స్‌ఫార్మర్, వృక్షాలు

కుప్పంలో ఈదురు గాలులతో కూడిన వర్షానికి విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు భారీ వృక్షాలు నేలకూలాయి. మండలంలోని పలవేరిమిట్టలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ నేలకు ఒరిగి విద్యుత్తు సరఫరా ఆగిపోయింది. పురపాలక సంఘ పరిధిలోని డీకేపల్లె ప్రాంతంలో భారీ వృక్షాలు దారికి అడ్డుగా పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గోనుగూరు, ఉర్లవోబనపల్లె, దాసేగానూరు, కృష్ణదాసనపల్లె తదితర గ్రామాలలో మామిడికాయలు రాలిపోయి రైతులకు అపార నష్టం తెచ్చిపెట్టింది.





విద్యుదాఘాతంతో మృతి చెందిన పాడి ఆవు - పిడుగుపడి మృతి చెందిన పాడి ఆవు

పులిచెర్ల మండలంలో గాలివాన బీభత్సం

- విద్యుదాఘాతం, పిడుగుపాటుకు రెండు ఆవుల మృతి

కల్లూరు, జూన్ 1: మండలంలో శనివారం వడగండ్లతో కూడిన గాలివాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మంగళంపేటలో 11కేవీ విద్యుత్ వైర్లు తెగి ఒక ఆవు మృతి చెందింది. రేణుమాకులపల్లిలో పిడుగుపడి మరో ఆవు మృతి చెందింది. పంటలకు కూడా నష్టం చేకూరింది.

గుడిపాలలో భారీ నష్టం



కుప్పిగానిపల్లెలో కూలిన ఇంటి పైకప్పు

గుడిపాల, జూన్ 1: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వీచిన పెనుగాలులకు భారీ నష్టం జరిగింది. ఏఎల్ పురం, నారగల్లు, 197 రామాపురం, కుప్పిగానిపల్లెలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కుప్పిగానిపల్లె దళితవాడలో శాంతమ్మ ఇంటికప్పు కూలింది. నిత్యావసర సరుకులు తడిసిపోయాయి. పిడుగుపాటుకు కొత్తపల్లె దళితవాడకు చెందిన చిన్నకుట్టికి చెందిన మేకలు మృతిచెందాయి. మామిడికాయలు నేల రాలాయి.

నేలపాలైన మామిడి



బొమ్మయ్యపల్లె సమీపంలో నేలకూలిన మామిడి చెట్టు

వెదురుకుప్పం : మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయతీలో శనివారం సాయంత్రం వడగళ్ల వాన కురిసింది. దీంతో ఉన్న కొద్దిపాటి మామిడి కాయలు రాలిపోయాయి. సుమారు రూ.5లక్షల వరకు నష్టం జరిగి ఉంటుందని రైతులు తెలిపారు.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ప్రణాళిక

సుప్రీం ఆదేశాల మేరకు ఐదు వీవీ ప్యాట్ల లెక్కింపు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 1: స్థానిక ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 4వ తేదీ చిత్తూరు పార్లమెంటు స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు అధికారులు పకడ్బందీ ప్రణాళిక రూపొందించారు. మంగళవారం ఉదయం 5 గంటలకే ఉద్యోగులందరూ కళాశాలకు చేరుకుని, వారికి కేటాయించిన విధుల్లో నిమగ్నం కావాలి. తొలుత ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభిస్తారు. అరగంట వ్యవధి తర్వాత 8.30 గంటల నుంచి ఈవీఎంల ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది.

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఇలా...

ఈసీఐ మార్గదర్శకాల మేరకు పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు చేపడతారు. ఉదయాన్నే స్ట్రాంగ్‌రూమ్‌ల నుంచి పోస్టల్ బ్యాలెట్ల బాక్సులు తెచ్చి లెక్కింపు ప్రారంభిస్తారు. ఉదయం 8 గంటలతో లెక్కింపు ప్రక్రియ ప్రారంభమౌతుంది. చిత్తూరు లోక్‌సభ స్థానానికి 22,957 పోస్టల్ బ్యాలెట్లు వచ్చాయి. వీటి లెక్కింపు కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. అసెంబ్లీ స్థానాల కోసం 20,480 పోస్టల్ బ్యాలెట్లు వచ్చే అవకాశాలున్నాయి. ప్రతి టేబుల్‌కు తొలి రౌండులో 500 చొప్పున పోస్టల్ బ్యాలెట్లు ఇస్తారు. ఆమోదం పొందినవి ఒక పెట్టెలో, తిరస్కరణకు గురైనవి మరోపెట్టెలో వేస్తారు. ఆమోదం పొందిన బ్యాలెట్ పేపర్లను 25 చొప్పున ఒక బండల్‌గా కడతారు. ఆ తర్వాత ఒక్కొక్క బండిల్‌లోని 25 పత్రాలను అభ్యర్థుల వారీగా వేరుచేసి వారికి కేటాయించిన బాక్సుల్లో వేస్తారు. ఇలా నియోజకవర్గంలో ఉన్న పోస్టల్ బ్యాలెట్లన్నీ రౌండ్ల వారీగా లెక్కిస్తారు.

అంతా ఆన్‌లైన్ ద్వారానే...

ఈటీపీబీఎస్ (ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టం)లో వచ్చిన సర్వీసు ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు జరిగాయి. ఒక్కో ఓటుకు సంబంధించి నాలుగు సార్లు స్కానింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే జరుగుతాయి. ఇందుకోసం ఇంటర్నెట్ సదుపాయం ఉన్న కంప్యూటర్లను కౌంటింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం వరకు వచ్చిన కవర్లను కలెక్టర్ కార్యాలయంలో భద్రపరిచి స్ట్రాంగ్‌రూమ్‌కు తరలిస్తారు. మంగళవారం ఉదయం ఈవీఎం ఓట్ల లెక్కింపుకు ముందుగా వచ్చిన వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటారు.

వీవీప్యాట్ స్లిప్పుల లెక్కింపు

సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో ర్యాండమైజేషన్‌గా ఎంపిక చేసిన ఐదు వీవీప్యాట్ స్లిప్పులను లెక్కిస్తారు. సాంకేతిక కారణంగా కంట్రోల్ యూనిట్ రిజల్ట్ బటన్ పనిచేయకపోయినా, ఫారం-17లో పోలింగ్ ఆఫీసర్ నమోదు చేసిన ఓట్లకు ఈవీఎంలో ఓట్ల సంఖ్యకు తేడా వచ్చిన సందర్భంలో వీవీ ప్యాట్ స్లిప్పులను పరిగణనలోకి తీసుకుని చివర్లో లెక్కిస్తారు.

కాలం చెల్లిన కిట్స్‌తో తాగునీటి పరీక్షలు

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం





కిట్లలో సేకరించిన తాగునీటి శ్యాంపిల్స్ - కిట్ల గడువు తేదీ వివరాలు

వెదురుకుప్పం, జూన్ 1 : కాలం చెల్లిన కిట్స్‌లో తాగునీటి పరీక్షలు చేస్తూ ప్రజారోగ్యంతో మండల యంత్రాంగం ఆడుకుంటోంది. వర్షాలు రానున్న నేపథ్యంలో కలుషితం కాని నీటిని ప్రజలకు అందించాలన్న ఉద్దేశంతో కిట్లతో తాగునీటి పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. ఈ బాధ్యతను గ్రామీణ తాగునీటి సరఫరా అధికారుల(ఆర్‌డబ్ల్యుఎస్)కు అప్పగించింది. అయితే అధికారులు కాలం చెల్లిన కిట్స్‌తో తాగునీటి పరీక్షకు శ్యాంపిల్స్ సేకరించడం విమర్శలకు తావిస్తోంది. మండలంలో 25 గ్రామ పంచాయతీలు, 13 గ్రామ సచివాలయాలున్నాయి. వీటి పరిధిలో 222 హేబిటేషన్లు ఉన్నాయి. ఈ హేబిటేషన్లలో 299 శ్యాంపిల్స్ సేకరించాలని ప్రభుత్వ నిబంధన. 266 చోట్ల శ్యాంపిల్స్ సేకరించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మిగతా 33 చోట్ల శ్యాంపిల్స్ సేకరించాల్సి ఉంది. అయితే ఈ కిట్స్ గడువు ఈనెల 10వ తేదీ నాటికి ముగిసిపోయింది. 29వ తేదీన శ్యాంపిల్స్ సేకరించారు. గడువు తీరిన కిట్ల ద్వారా శ్యాంపిల్స్ సేకరిస్తే ఫలితాలు కచ్చితంగా వస్తాయా అన్న అనుమానాలు కొందరు సచివాలయ ఉద్యోగులే వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది.

ఉన్నతాధికారుల ఆదేశాలతోనే..

మండల ఉన్నతాధికారుల ఆదేశాలతోనే ఆ కిట్స్‌తో శ్యాంపిల్స్ సేకరించాం. కాలం చెల్లి ఇరవై రోజులే అయింది.. చెయ్యొచ్చు అన్న ఆదేశాలతోనే చేశాం. ప్రభుత్వం నుంచి కిట్స్ రావాల్సి ఉంది. తాజా కిట్స్‌రాగానే మళ్లీ శ్యాంపిల్స్ సేకరించి పరీక్షకు పంపిస్తాం.

- తిమ్మరాజులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ

కిక్కిరిసిన జపాలి





జపాలిలో భక్తుల రద్దీ - హనుమాన్ మాల భక్తులు

తిరుమల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి సందర్భంగా తిరుమలలోని జపాలి క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. శుక్రవారం రాత్రి నుంచే భక్తులు భారీగా చేరుకోవడం క్షేత్రం రద్దీగా మారింది. శనివారం ఉదయం ఆలయంలో అభిషేకాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటలకు టీటీడీ తరఫున ఈవో పట్టువస్త్రాలు సమర్పించారు. ఆదివారం ధర్మగిరి వేదపాఠశాలలలో సంపూర్ణ సుందరకాండ అఖండ పారాయణం జరుగుతుందని ఈవో తెలిపారు. 2,823 శ్లోకాలను పండితులు నిరంతరాయంగా 18 గంటల పాటు పా రాయణం చేస్తారన్నారు. అలాగే శ్రీవారి ఆలయం ముందున్న బేడి ఆంజనేయస్వామి ఆలయంలోనూ ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం మొదటిఘాట్‌లోని ఏడో మైలు ప్రసన్న ఆంజనేయస్వామి వద్ద కూడా పూజలు జరిగాయి. ఇక, శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనానికి నిత్యం పరదాలు ఇచ్చే తిరుపతికి చెందిన మణి జపాలి హనుమంతునికి కూడా పరదాలు అందజేశారు. హథీరాంజీ మఠం మహంతు ఓం ప్రకాష్ దాస్‌జీ, వైఖానస ఆగమ సలహాదారు మోహనరంగాచార్య, డిప్యూటీఈవోలు లోకనాథం, సెల్వం, పారుపత్తేదార్ తులసీ ప్రసాద్, ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠం పండితులు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో కనపడితే కేసులే

● కట్టడికి మూడంచెల పద్మ వ్యూహం

● ప్రత్యేక డీఎస్పీ మోహన్ రావు హెచ్చరికలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక డీఎస్పీ మోహన రావు

కలికిరి, జూన్ 1: లెక్కింపు జరిగే రోజు పీలేరు నియోజకవర్గీయులు ఎవరైనా రాయచోటిలో కనపడితే కేసులు పెడతామని, నాన్ బెయిలబుల్ సెక్షన్లు వర్తిస్తాయని పీలేరు నియోజకవర్గం శాంతి భద్రతల ప్రత్యేక డీఎస్పీ మోహన్ రావు హెచ్చరించారు. గుర్తింపు కార్డులు లేని వారు ఎన్నికల విధుల సమయంలో రాయచోటిలో తిరిగి అనవసర సమస్యలు కొని తెచ్చుకోవద్దని హితవు పలికారు. కౌంటింగ్ సందర్భంగా పోలీసులు చేపడుతున్న ప్రత్యేక చర్యల గురించి వివరిస్తూ పోలీసు స్టేషన్‌లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, నేతలు, కార్యకర్తలకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. కరోనా లాక్‌డౌన్ తలపించేలా అప్రకటిత కర్ఫ్యూ వుంటుందన్నారు. దేశం మొత్తం మీద అత్యధిక పోలింగ్ జరిగిన రాష్ట్రంగా ఏపీ గుర్తింపు తెచ్చుకుందని, ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవల్లో కూడా మొదటి స్థానంలోకి రావడం దురదృష్టకరమన్నారు. ఫలితంగా లెక్కలేనంత మంది పోలీసులు, అధికారులు సస్పెండయ్యారన్నారు. ఎన్నికల నియమావళి అమలులో వున్న 6వ తేదీ వరకూ ఎలాంటి ఊరేగింపులు, బహిరంగ సంబరాలను అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. రాయచోటిలో బయటి వ్యక్తులకు ఆశ్రయం కల్పించకూడదని అన్ని లాడ్జిలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. నాన్ లోకల్ వ్యక్తులు కనిపిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. మూడు రోజులపాటు మద్యం దుకాణాలు మూసేస్తామని, మద్యం సేవించి బహిరంగంగా కనపడితే కేసులు నమోదు చేస్తామన్నారు. కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆర్.మోహన్, ఎస్‌ఐ దేవేంద్రకుమార్, ఏఎస్‌ఐలు, హెచ్‌సీ, పోలీసు సిబ్బంది, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

'స్వతంత్ర' ఏజెంట్లపై సందిగ్ధత?

● కౌంటింగ్‌కు హాజరయ్యే ఏజెంట్లకు బ్రీత్ అనలైజర్ పరీక్ష

కలికిరి, జూన్ 1: మంగళవారం జరగనున్న ఎన్నికల లెక్కింపు కోసం ఇండిపెండెంట్ అభ్యర్థుల తరపున ఏజెంట్లను అనుమతించాలా లేదా అనే విషయంపై సందిగ్ధత నెలకొంది. కౌంటింగ్ హాల్లో ఏజెంట్లకు కేటాయిస్తున్న వలయంలో ఎంత మంది కూర్చోవడానికి అనువుగా వుంటుందన్న విషయంలో ఇంకా స్పష్టత రాని నేపథ్యంలో ఇండిపెండెంట్ అభ్యర్థుల తరపున ఏజెంట్లను అనుమతించే విషయమై అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వలేకున్నారు. జాతీయ, ప్రాంతీయ పార్టీ అభ్యర్థులు, గుర్తింపు పొందిన రిజిస్టర్డు పార్టీలు, గుర్తింపు లేని రిజిస్టర్డు పార్టీల అభ్యర్థులందరికీ ఏజెంట్లను అనుమతించనున్నారు. కౌంటింగ్ కోసం ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్ల వంతున ఏర్పాటు చేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపుకు అదనంగా నాలుగు టేబుళ్ళుంటాయి. మొత్తం మీద ఒక్కో అభ్యర్థికి 18 మంది ఏజెంట్లను అనుమతించాల్సి వుంటుంది. ఇండిపెండెంట్లతో కలిపి సరాసరిన 10 మంది అభ్యర్థులున్నా 180 మంది ఏజెంట్లను అనుమతించాల్సి వుంటుంది. దీంతో ఇంత మంది ఏజెంట్లకు సరిపడా స్థలం, సౌకర్యాలు వుంటాయా అన్న విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు సహా ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా రిటర్నింగ్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. స్థలం, సౌకర్యాలు అందుబాటులో వుండే పరిస్థితులను బట్టి ఇండిపెండెంట్ అభ్యర్థులను అనుమతించాలా వద్దా అనే విషయాన్ని రిటర్నింగ్ అధికారే నిర్ణయం తీసుకోనున్నట్లు చెపుతున్నారు.

ఏజెంట్లకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు

కౌంటింగ్ ఏజెంట్లకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. కౌంటింగ్ హాలు లోపలికి వెళ్ళే ఏజెంట్లను రెండంచెల్లో క్షుణ్ణంగా తనిఖీ చేయనున్నారు. సెల్ ఫోన్లు కూడా అనుమతించకుండా భద్రపరచడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. కేవలం పెన్ను, ఖాళీ పుస్తకం లేక ఖాళీ కాగితాలను మాత్రం అనుమతించనున్నారు. ఈ సారి కొత్తగా ఏజెంట్లకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఏ మాత్రం మద్యం తీసుకున్నట్లు ఆనవాళ్ళు లభించినా వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి అనుమతించరు. పోలీసులు అమలు చేస్తున్న కఠిన నిబంధనల కనువుగా అభ్యర్థులు కూడా తమ ఏజెంట్లను అప్రమత్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రాథమికదశలో గుర్తిస్తే ప్రాణాలు కాపాడవచ్చు

మదనపల్లె టౌన్, జూన్ 1: మనిషిలోని క్యాన్సర్‌వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే వారి ప్రాణాలు కాపాడవచ్చని ప్రభుత్వ సర్వజన బోధనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఎస్.రాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక జీటీహెచ్‌లోని డీఈఐసీ భవనంలో హోమిబాబా క్యాన్సర్ ట్రైనింగ్ సెంటర్, తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజి ప్రొఫెసర్లు పలురకాల క్యాన్సర్ నివారణపై శిక్షణ నిర్వహించారు. డాక్టర్ రాజు మాట్లాడుతూ సర్వైకల్, రొమ్ము, నోటి క్యాన్సర్ల గురించి వివరించారు. క్యాన్సర్ సోకిన వెంటనే వాటి లక్షణాలను గుర్తించి వైద్యం అందిస్తే మనిషి ప్రాణాలు కాపడవచ్చన్నారు. మొదటి దశలో బోధనాస్పత్రి వైద్యులకు క్యాన్సర్ నివారణపై శిక్షణ ఇస్తామని, రెండో దశలో ప్రాంతీయ వైద్యశాలలోని వైద్యులకు, మూడో దశలో పీహెచ్‌సీ, ఎల్‌హెచ్‌సీల వైద్యులకు శిక్షణ ఇస్తామన్నారు. మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జమున మాట్లాడుతూ క్యాన్సర్ వున్న వారిని గుర్తిస్తే 70శాతం మంది ఆరోగ్యం కాపాడవచ్చన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వైద్యులు ఈనెల 5 తేదీ నుంచి 7వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా మెడికల్ ఆఫీసర్లకు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణలో నోడల్ ఆఫీసర్లు డాక్టర్ వెంకటలక్ష్మి, సౌమ్యపల్లవి, వైద్యులు రోజారమణి, ఇంద్రాణి, శ్రీనివాస్, సునీత, సోనియా, చండీప్రియ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్లకు అడ్డుపడటం దుర్మార్గం

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి



కలికిరి, జూన్ 1: ప్రభుత్వ సేవల్లో ఐదేళ్లు నిరంతరాయంగా పనిచేసిన ఉద్యోగులు చివరికి తమ ఓటు కూడా వేయనీయకుండా అడ్డుపడటం దుర్మార్గమైన చర్య అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఉద్యోగులు ఓటు వేసిన పోస్టల్ బ్యాలెట్లను కూడా చెల్లుబాటు కానివ్వకుండా కుట్ర పన్నడం భారత దేశంలో ఇంత వరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయలేదని, సిగ్గుచేటు చర్యగా ఆయన అభివర్ణించారు. నగరిపల్లెలో శనివారం కిశోర్‌కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ చిన్న చిన్న లోపాలున్నా ఓటు చెల్లుబాటు కోరుకుంటారే తప్ప కోర్టుకెక్కడం దిగజారుడుతనమేనని స్పష్టం చేశారు.

ఘనంగా దమ్మ పరివర్తన మహోత్సవం

మదనపల్లె అర్బన్, జూన్ 1: బుద్ధుని కొండలో శనివారం దమ్మ పరివర్తన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తథాగతుడు గౌతమబుద్ధుని జయంతిని పురస్కరించుకుని మదనపల్లె బుద్ధవిహార, బాస్ సంయుక్తంగా మహోత్సవాలు నిర్వహించాయి. బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన మహోత్సవాలకు బెంగళూరు మహాబోధి సొసైటీకి చెందిన 20 మంది బౌద్ధ బిక్షువులు హాజరై బుద్ధపూజ, దమ్మ ప్రవచనాలు చేశారు. బౌద్ధబిక్షువుబంతే జ్ఞానానంద మాట్లాడుతూ మనిషి కోర్కెలపై అదుపు కలిగి, నైతిక విలువలతో జీవించి, దుఃఖరహిత సమాజాన్ని ఆవిష్కరించేందుకు ఉపయుక్తంగా ఉండే ఉన్నతమైన జీవన మార్గాన్ని బుద్ధుడు కనుగొన్నారని తెలిపారు. ఈ మార్గాన్నే బౌద్ధ దమ్మంగా నేడు ప్రపంచమంతటా ఆచరిస్తున్నారు. గౌతమబుద్ధుని విగ్రహాలను బోధి వృక్షమును పూజించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకిలో కొండపై తథాగతుని ప్రతిమను ఊరేగించారు. బుద్దిస్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, దళిత సంఘర్షణ సమితి కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్, జానపద అకాడమీ చైర్మన్ గొల్లహళ్లి శివప్రసాద్, ప్రజాకవి సోతబోలు రెడ్డెప్ప, ఐఆర్ఎస్ అధికారి గౌతమి, తదితరులు హాజరై బౌద్ధ జీవన విధానం అవసరాన్ని ప్రజలకు చేరవేసే మార్గాన్ని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ప్రముఖులు కంభం నాగభూషణం రెడ్డి, మార్పూరి శశిధర్‌రావు, డాక్టర్ చంద్రయ్య, బైసాని సురేష్, బౌద్ధ ఉపవాసకులు చాట్ల బయన్న, నీరుగట్టి రమణ, కేవీ రమణ, గణపతి, తలారికృష్ణ, తాతయ్య, ముత్యాల మోహన్, రాజేంద్రన్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత శంకర్‌రెడ్డి మృతి

రామసముద్రం, జూన్ 1: రామసముద్రం మండలం, మూగవారి పంచాయతీ కొత్తూరు టీడీపీ సీనియర్ నాయకుడు పెద్ద పాపిరెడ్డి గారి శంకర్‌రెడ్డి శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఇతని ఆకస్మిక మరణం పట్ల మదనపల్లె టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇతని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. శంకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో మదనపల్లె మాజీ టౌన్ బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, మదనపల్లె నేతలు గుండాల రామచంద్ర, రామసముద్రం మండల టీడీపీ అధ్యక్షులు విజయ్‌కుమార్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు కొండూరు నారాయణరెడ్డి, కృష్ణంరాజు, రాజేష్ స్థానికం, తెలుగు యువత అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, మైనార్టీ నేతలు ఒంటెల అల్తాఫ్‌బాషా, శివ, కొండూరు రెడ్డెప్ప, శివారెడ్డి, పెద్దప్పయ్య, అశోక్, మట్లవారిపల్లె కిట్ట, శ్రీనాథ్‌రెడ్డి, మంజునాథ్, మునిరెడ్డి, మనోజ్, శ్రీకాంత్, శీన, పలువురు మండల కార్యకర్తలు నివాళులర్పించారు.

వైభవంగా హనుమజ్జయంత్యుత్సవం

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు ● పోటెత్తిన భక్తులు ● భక్తులకు పెద్దఎత్తున అన్నదానాలు











ప్రత్యేకాలంకరణలతో ఆంజనేయస్వామి, కార్యసిద్ధి అభయాంజనేయస్వామి నగరోత్సవం (వాల్మీకిపురం) - కలకడలో ప్రత్యేక అలంకరణ - కురబలకోటలో...

వాడవాడలా హనుమాన్ జయంత్యుత్సవాలను ఎంతో వైభవంగా చేసుకున్నారు. అనేక ప్రాంతాల్లో ఆంజనేయస్వామికి విశేష భక్తజనం నడుమ అభిషేకాలు, అర్చన, సింధూర పూజ, తోమాల, వడమాల సేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. మరికొన్ని ప్రాంతాల్లో నగరోత్సవం నిర్వహించారు. గ్రామ గ్రామాన ఆంజనేయస్వాముల వారి భజనలతో భక్తిని చాటుకున్నారు. వివరాల్లోకెళితే....

మదనపల్లె అర్బన్ జూన్ 1: పట్టణంలోని పలు ఆలయాల్లో శనివారం హనుమాన్ జయంత్యుత్సవం వైభవంగా నిర్వహించారు. నీరుగట్టువారిపల్లెలోని కాట్లాటపల్లె రోడ్డు మారుతీనగర్‌లో వెలసిన ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో కమిటీ అధ్యక్షుడు పురాణం వెంకటరత్నం ఆధ్వర్యంలో ఉదయాన్నే స్వామివారిని గంధంతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం వేలాది మందికి అన్నదానం చేశారు. స్వామివారి ప్రత్యేక పూజలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ కూటమి అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. సాయంత్రం ప్రత్యేక వాహనంలో ఆంజనేయస్వామి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. స్థానిక చౌడేశ్వరీ సర్కిల్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ఆలయకమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ పుట్టిన రోజు సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 11గంటల నుంచే అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని అలంకరించి నీరగట్టువారిపల్లెలో ఊరేగింపు నిర్వహించారు. చౌడేశ్వరీ కళ్యాణ మండపం సర్కిల్ ఆంజనేయస్వామికి విశేషంగా పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. నిమ్మనపల్లెరోడ్డులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలకరణ చేసి పూజలు, భజనలు నిర్వహించారు. పుంగనూరు రోడ్డులోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం నుంచి నిర్వహకులు హనుమాన్ జయంత్యుత్సవం పురస్కరించుకుని ప్రత్యేకంగా అంలకరణలు, అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం ఆంజనేయ స్వామిని ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఆకుపూజ నిర్వహించి ఘనంగా పుంగనూరు రోడ్డు, కమ్మగడ్డవీధి, శేషప్పతోట తదితర ప్రాంతాల్లో వైభవంగా ఊరేగించారు. ఊరేగింపులో ఆలయ నిర్వహకులు బాబు, భువనేశరి, రెడ్డిసంఘం రాష్ట్రగౌరవాధ్యక్షుడు వరదారెడ్డిగారి నారథరెడ్డి, కృష్ణవేణి, ఎం. నారాయణ పాల్గొన్నారు. బీటీ కళాశాల మైదానంలోని వరాల ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆంజనేయుడికి మామిడి పండ్లతో ప్రత్యేక అలంకరణలు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా ఊరేగించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం మండలంలో...

వాల్మీకిపురం, జూన్ 1: వాల్మీకిపురం మండల వ్యాప్తంగా శనివారం హనుమాన్ జయంత్యుత్సవాలను ఎంతో వైభవంగా చేసుకున్నారు. పట్టణ పొడమర పొలిమేరలోని ధర్మపథం ఆలయంలో షిరిడీ సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం పట్టణంలో ఆంజనేయస్వామి నగరోత్సవం అనంతరం ధర్మపథంలో కార్యసిద్ధి అభయాంజనేయుడికి విశేష భక్తజనం నడుమ అభిషేకాలు, అర్చన, సింధూర పూజ, తోమాల, వడమాల సేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈసందర్భంగా ఆలయం వద్ద భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. అలాగే స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్దగల ఆంజనేయస్వామి ఆలయం, మండలంలోని జమ్ముళ్లపల్లె, పాతకోటపల్లె, బీదవాండ్లపల్లె, జర్రావారిపల్లె, నగిరిమడుగు, కొత్తమంచూరు తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి విగ్రహాలకు అబిషేకాలు, అలంకరణలతో పూజలు నిర్వహించి అట్టహాసంగా జయంతి వేడుకలు చేసుకున్నారు. అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, విశేష సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యం మండలంలో...

పెద్దమండ్యం, జూన్ 1: ఆంజనేయస్వామి జయంత్యుత్సవం పురస్కరించుకుని మండలంలో ఆంజనేయస్వామి, రాములోరి దేవాలయాల్లో ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. పెద్దమండ్యం, కలిచెర్ల, ముసలికుంట, పాపేపల్లి, బిక్కావాండ్లపల్లి, చెరువుకింపల్లి, వెలిగల్లు, మండలవారిపల్లి, కొలిమికాడపల్లి, రెక్కలకొండపల్లి, గుర్రంవాండ్లపల్లి, బండ్రేవు, శివపురం, బండమీదపల్లి, కోటగుట్టపల్లి తదితర గ్రామాల్లో హనుమాన్ జయంత్యుత్సవాలు ఘనంగా జరిగాయి. అన్నదానాలు జరిగాయి. గ్రామాల్లో రాత్రి హనుమాన్ భక్తులు భజన కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందశారు.

ములకలచెరువు మండలంలో...

ములకలచెరువు, జూన్ 1: మండలంలో శనివారం హనుమ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ములకలచెరువు, పెద్దపాళ్యం, వేపూరికోట, గూడుపల్లె, గాలేటివారిపల్లె, సోంపాళ్యం తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తంబళ్లపల్లె మండలంలో...

తంబళ్లపల్లె, జూన్ 1: మండలంలో హనుమాన్ ఆవిర్భావ దినోత్సవం ప్రజలు వైభవంగా చేసుకున్నారు. ఆలయాల్లో ఆంజనేయ స్వామిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఆంజనేయ స్వామి ఆలయాలకు వెళ్లి కాయకర్పూరాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మూలపల్లె బస్టాప్ వద్ద వెలసిన అభయాంజనేయ స్వామికి, మరిమిరెడ్డిగారిపల్లె బస్టాప్ వద్ద వెలసిన ఆంజనేయ స్వామి వారికి ఆయా గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

కలకడ మండలంలో....

కలకడ, జూన్ 1: బాటవారిపల్లె పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంత్యుత్సవం చేసుకున్నారు. పూజారి రామయ్య ఉదయం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ఆకుపూజ, అభిషేకం చేశారు. తదుపరి అన్నదానాలు చేసి ప్రసాదాలు పంపిణీ చేశారు. సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అంజన్నను దర్శించుకుని పూజలు చేశారు. రాత్రి కోలాటాలు, చెక్క భజనలు నడుమ ఉత్సవమూర్తిని ఊరేగించారు.

కురబలకోట మండలంలో...

కురబలకోట, జూన్ 1: మండలంలో హనుమాన్ జయంత్యుత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. చేనేతనగర్, ముదివేడు, గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో వేడుకలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంత భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులు మొక్కులు చెల్లించారు.

పీటీఎం మండలంలో...

పెద్దతిప్పసముద్రం జూన్ 1: హనుమాన్ జయంత్యుత్సవం పలు గ్రామాల్లో వేడుకగా నిర్వహించారు. మల్లెల, రంగసముద్రం, కందుకూరు, పులికల్లు, టి.సదుం, పీటీఎం, కాట్నగల్లు గ్రామాల్లో ఉదయం నుండి ఆంజనేయస్వామి ఆలయాల్లో అభిషేక పూజలు, స్వామి వారికి ఆకుపూజలు నిర్వహించి స్వామి వారిని తమలపాకులతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.



మారుతీనగర్‌లో అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మూడు టిప్పర్లు..ఆరు ట్రాక్టర్లు

మదనపల్లెలో జోరుగా ఇసుక, మట్టి అక్రమ రవాణా ● ఎన్నికల విధుల్లో అధికారులు





శుక్రవారం రాత్రి ఎస్ఈబీ అధికారులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్
శనివారం పట్టణంలో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న టిప్పర్

మదనపల్లె టౌన్, జూన్ 1: ఎన్నికల విధుల్లో అటు రెవెన్యూ, ఇటు పోలీసు అధికారులు ఉండటం, మైనింగ్ అధికారుల ఆచూకీ లేకపోవడంతో మదనపల్లెలో ఇసుక, మట్టి అక్రమ రవాణా మూడు టిప్పర్లు...ఆరు ట్రాక్టర్లు అన్న చందంగా జోరుగా సాగుతోంది. మదనపల్లెలో భవన నిర్మాణాల వేగం పెరిగింది. పట్టణంలో ఎంత లేదన్నా 100 చోట్ల భవనాలు, ఇళ్లు నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటి కోసం ఇసుక, మట్టి అవసరం ఉండటం, దూర ప్రాంతాల్లోని ఇసుక రీచ్‌లు మూతపడటంతో స్థానికంగా ఇసుక వ్యాపారుల పంట పండుతోంది. మదనపల్లె పట్టణానికి నిత్యం 200 ట్రాక్టర్ల ఇసుక, 100 టిప్పర్ల ఎర్రమట్టి అక్రమంగా రవాణా అవుతోంది. మదనపల్లె మండలంలోని చీకిలబైలు, వేంపల్లె, చిప్పిలి సమ్మర్‌స్టోరేజి ట్యాంకు, సీటీఎం పెద్దచెరువు, పోతబోలు చెరువు, నిమ్మనపల్లె మార్గంలోని బాహుదా ప్రాజెక్టు, పెంచుపాడు రోడ్డులోని కోటవారిపల్లె చెరువు, పొన్నేటిపాళెం పెద్దవంక నుంచి ఇసుక వ్యాపారులు ట్రాక్టర్లలో ఇసుకను రాత్రిళ్లు అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుక డిమాండ్‌ను బట్టి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇదిలా వుండగా ఇసుక ట్రాక్టర్లతో మట్టి, ఇసుక అక్రమ రవాణా ఆలస్యం కావస్తుండడంతో కొందరు చిన్న టిప్పర్లతో మట్టి, ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఈ టిప్పర్లకు కనీసం రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లు కనపడకుండా పీకేసి అక్రమ రవాణా చేస్తున్నారంటే వీరికి అడ్డూఅదుపు లేదనటానికి నిదర్శనంగా చెప్పవచ్చు. పట్టణంలో నిత్యం టిప్పర్లు బహిరంగంగానే అక్రమ రవాణా చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. బెంగళూరు రోడ్డులోని వేంపల్లె వద్ద ప్రభుత్వ పొరంబోకు స్థలంలో ఉన్న గుట్ట వద్ద ఎక్స్‌కవేటర్లు పెట్టి మట్టిని తవ్వి టిప్పర్లతో రవాణా చేస్తున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

మదనపల్లె మండలం చిప్పిలి సమ్మర్ స్టోరేజి ట్యాంకు నుంచి శుక్రవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎస్ఈబీ పోలీసులు పట్టుకున్నారు. నక్కలదిన్నెకు చెందిన ముగ్గురి ట్రాక్టర్లు రోజూ ఇసుక అక్రమ రవాణా చేస్తున్నాయి. ఈ క్రమంలో రెవెన్యూ, పోలీసు అధికారులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉండడంతో స్థానికులు ఎస్ఈబీ ఎస్ఐ రాముడుకు సమాచారం అందించారు. దీంతో ఆయన తన సిబ్బందితో వెళ్లి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని మదనపల్లె తాలూకా పోలీసులకు అప్పగించారు. ఇసుక అక్రమరవాణా విషయమై తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి ఇసుక ట్రాక్టర్ల యజమానులకు జరిమానా విధించే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

గ్రామాల్లో పికెటింగ్

నిమ్మనపల్లి, జూన్ 1: ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా జూన్ 4న పలు గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జూన్1 నుంచి 4వరకు పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కొన్ని సమస్యాత్మక గ్రామాల్లో కౌంటిగ్‌ను దృష్టిలో వుంచుకుని రాచవేటివారిపల్లి, వెంగంవారిపల్లిల్లో మూడు పోలీసు టీంలు పహరా కాస్తూ ఎలాంటి గొడవలు అల్లర్లు జరగకుండా చూస్తుంటాయన్నారు. రాష్ట్రంలో మూడు రోజుల పాటు మద్యం విక్రయాలు నిలిపివేశామన్నారు. దీంతో పాటు నలుగురు కంటే ఎక్కువ మంది గుమికూడవద్దని మైక్ ద్వారా ప్రజలకు తెలిపారు. గ్రామాల్లో సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురు కొని గలాటాలకు దిగవద్దని తెలిపారు. నిత్యం గ్రామాల్లో వుండి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

మేనేజరుపై చర్యలు తీసుకోవాలని వినతి

మదనపల్లె అర్బన్, జూన్ 1: స్వీపర్లపై అసభ్య పదజాలంలో అవమానిస్తున్న బస్టాండ్ మేనేజరు రమణపై చర్యలు తీసుకోవాలని శనివారం ఏఐటీయూసీ నాయకులు డిపో మేనేజరు వెంకటరమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్‌లో పారిశుధ్య పనులు చేస్తున్న స్వీపర్లను అసభ్య పదజాలంతో అవమానిస్తున్న బస్టాండ్ మేనేజరు రమణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్వీపర్లకు వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దేవా, మురళి, స్వీపర్లు పాల్గొన్నారు.

మందగిరి ఆలయంలో ఎన్‌డీఏ నేతల పూజలు

సిద్దవటం, జూన్ 1: చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావాలంటూ టీడీపీ నేతలు శనివారం కనుమలోపల్లె సమీప మందగిరి శనేశ్వరాలయంలో పూజలు నిర్వహించి 101 కొబ్బరి కాయలను కొట్టారు. రాజంపేట నియోజక వర్గం నుంచి టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం అఖండ మెజార్టీలో గెలుపొందాలని పూజలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ గోత్రనామాలపై అర్చకులు పూజలు నిర్వహించారు. జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు కుప్పల వెంకటసుబ్బయ్య, జనసేన రాష్ట్ర చేనేత కార్యదర్శి రామయ్య, ఎన్‌డీఏ నేత, పార్లమెంటు ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం మెరుగ్గా ఉండాలి



వాల్మీకిపురం ఎమ్మార్సీలో కార్మికుల శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటరత్నం

వాల్మీకిపురం, జూన్ 1: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెరుగ్గా ఉండేలా చూసుకోవాలని వాల్మీకిపురం ఎంఈఓ వెంకటరత్నం పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎమ్మార్సీలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం ముందే వంట గదులు, పాత్రలు, బియ్యం శుభ్రపరచుకోవాలన్నారు. పిల్లలకు వడ్డించే భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా ఉండాలని సూచించారు. మండలంలో మధ్యాహ్న భోజనం పథకంలో ఎలాంటి సమస్యలున్నా తెలియజేయాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం పథకం కార్మికులకు వంటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో అదనపు ఎంఈఓ వెంకటలక్ష్మి, ఎమ్మార్సీ సిబ్బంది ముత్యాలు, రమణప్ప, విజయ్, సులోచన, సుదర్శన్ పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ఉండాలి

గుర్రంకొండ, జూన్ 1: ఎన్నికల ఫలితాల రోజుల ప్రజలు ఎటువంటి గొడవలకు పాల్పడకుండా ఉండాలని డీఎస్పీ మోహన్‌రావ్ అన్నారు. తరిగొండ, సంగసముద్రం గ్రామాల్లో శనివారం ఆయన నేతలు, ప్రజలతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాల రోజున ప్రజలు సమయమనం పాటించాలని కోరారు. గొడవలు, ఘర్షణలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. రాజకీయ పార్టీ నేతలు ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, జూన్ 1: తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అర్చకులు గోపాల్ భట్టర్, కృష్ణప్రసాద్, కృష్ణరాజు, అనిల్, గోకుల్, వెంకీ, వరద, సిబ్బంది నాగరాజ పాల్గొన్నారు.

4నే వెలుగులు విరజిమ్మేరోజు

కాంగ్రెస్ నేత ఎస్ రెడ్డి సాహెబ్ ధీమా

మదనపల్లె, అర్బన్, జూన్ 1: దేశానికి మరో మూడు రోజుల్లో మంచి రోజులు రాబోతున్నాయని ఆశాభావాన్ని మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేత ఎస్ రెడ్డి సాహెబ్ వ్యక్తం చేశారు. ఈ నెల 4వ తేదీ దేశ ప్రధాని ఎవరనేది స్పష్టంగా తెలుస్తుందన్నారు. సమావేశంలో డాక్టర్ ఎస్ కె బాషా, మీనాకుమారి, సోమశేఖర్, సమీర్, అన్వర్, మహబూబ్ పీర్, మహమ్మద్ అలి, అల్లాబక్షు, ఖాసిం, ఈశ్వరమ్మ, శరత్ కుమార్ రెడ్డి, నాగరాజు, మస్తాన్, శాజహాన్ బాషా, సయ్యద్, సోను తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం

ములకలచెరువు, జూన్ 1: ఖరీఫ్‌లో సాగుకు సబ్సిడీతో రైతులకు నాణ్యతమైన విత్తనాలు అందించడమే లక్ష్యమని ఎంపీడీఓ పోలప్ప పేర్కొన్నారు. పాత ములకలచెరువు రైతు భరోసా కేంద్రాన్ని శనివారం తనిఖీ చేసి వేరుశనగ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఆర్‌బీకే కేంద్రాలకు వచ్చే వేరుశనగ విత్తనాలను పరిశీలించి రైతులకు పంపిణీ చేయాలన్నారు. అనంతరం ఆర్‌బీకేలో నిల్వ ఉన్న వేరుశనగ విత్తనాల నాణ్యతను పరిశీలించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ రమీజా, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, మహిళా పోలీస్ ఖాసింబీ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు ఉద్యోగులు విరమణ

మదనపల్లె, జూన్ 1: మదనపల్లె హంద్రీ-నీవాలో నలుగురు ఉద్యోగులు విరమణ పొందారు. ఇందులో ఈఈలు డి.రమేష్‌బాబు, కె.వెంకటరమణారెడ్డి, డీఈ జి.శివారెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ వి.సుబ్బరాయుడు ఉన్నారు. ఈసందర్భంగా స్థానిక హంద్రీ-నీవా కార్యాలయంలో ఎస్ఈ సి.ఆర్.రాజగోపాల్ ఆధ్వర్యంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి తిరుపతి తెలుగుగంగ సీఈ వెంకటరమణ, ఇరిగేషన్ సీఈ కె.నాగరాజ, విశ్రాంత సీఈ ఎం.నారాయణస్వామి, తదితరులు పెద్దసంఖ్యలో ఇంజనీరింగ్ అధికారులు హాజరయ్యారు. రిటైర్డ్ అయిన ఈఈ డి.రమేష్‌బాబు స్థానంలో జి.సురేష్‌బాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. వాల్మీకిపురం నీటిపారుదలశాఖ కార్యాలయంలో డీఈగా పనిచేస్తున్న జి.సురేష్‌బాబును ప్రభుత్వం ఇన్‌చార్జి ఈఈగా బాధ్యతలు అప్పగించడంతో ఆయన విధుల్లో చేరారు.

ఓఆర్‌లో మదనపల్లె 1 డిపో ప్రథమ స్థానం

మదనపల్లె అర్బన్, జూన్ 1: ఓఆర్ సాధించడంలో రీజియన్‌లోనే మదనపల్లె వన్ డిపో మొదటి స్థానంలో నిలిచిందని డిపోమేనేజరు వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక డిపోలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలో ఓఆర్ 70 శాతం సాధించి రీజియన్ లోనే ప్రథమస్థానం, కేఎంపీఎల్ 5.41 సాధించి రెండోస్థానంలో మదనపల్లె వన్ డిపో ఉందన్నారు. గ్యారేజీ, ట్రాఫిక్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో జూన్ ఈపీకే 40శాతం, కేఎంపీఎల్ 5.50 తీసుకురావడానికి కృషి చేయాలని డీఎం కోరారు. అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఎంఎఫ్ రవి, ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.